





# విశాఖ సమాచారమ్




Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 130 విశాఖపట్నం, 25 ఫిబ్రవరి 2026 బుధవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00



# దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా HPV వ్యాక్సిన్



**ఇంటర్నెట్ డెస్క్:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రత్యేక టీకా కార్యక్రమంలో భాగంగా 14ఏళ్ల వయసు పైబడిన బాలికలకు ఉచితంగా అందించనున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా గార్డాసిల్ ఇంజెక్షన్‌ను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నట్లు సమాచారం.

ఈ వ్యాక్సిన్ నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్‌లను నిరోధిస్తుంది. ఈ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18 తోపాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఒక డోసు వ్యాక్సిన్ అందించడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ కల్పిస్తుందని దేశీయంగా, అంతర్జాతీయంగా జరిపిన శాస్త్రీయ పరిశోధనల్లో తేలింది. జాతీయ కార్యక్రమంలో భాగంగా దీన్ని స్వచ్ఛందంగా, ఉచితంగా అందివ్వనున్నారు.

15ఏళ్ల లోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గార్డాసిల్-4 టీకాను రెండు డోసుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర. 3,927. అదే 15 ఏళ్ల వయసు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసుల్లో తీసుకోవాలి. ఈవ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులో అందిస్తున్నాయి.

**కేరళ పేరు.. ఇక కేరళం: కేంద్ర క్యాబినెట్ ఆమోదం**

ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

# ఏపీకి పోస్టల్ శాఖ గుడ్ న్యూస్

**- పోలీస్ శాఖ ఏపీలోని ఏకంగా పదకొండు నగరాలకు గుడ్ న్యూస్**

**- ప్రజల సదుపాయం కోసం ఈ విధంగా నిర్ణయం**




**అమరావతి, విశాఖ సమాచారమ్ ప్రతినిధి :**

పోలీస్ శాఖ ఏపీలోని ఏకంగా పదకొండు నగరాలకు గుడ్ న్యూస్ తెలిపింది. ప్రజల సదుపాయం కోసం ఈ విధంగా నిర్ణయం తీసుకున్నట్లుగా పేర్కొంది. స్పీడ్ పోస్ట్ సదుపాయం అన్నది ఈ రోజులలో అందరికీ అవసరం. దానికి ఏకంగా రోజుకి ఇరవై నాలుగు గంటలూ నిరంతరాయంగా అందచేస్తోంది. ఆ విధంగా భారత తపాలా శాఖ ప్రజలకు సౌకర్యం కలిగిస్తూ రాష్ట్రంలోని 11 ముఖ్య నగరాలలో 24ఐ7 స్పీడ్ పోస్ట్ మరియు పార్సెల్ బుకింగ్ సౌకర్యాలను ప్రారంభించింది.

ఈ సిటీలలో స్పీడ్ పోస్టు :

ఇదిలా ఉంటే ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, . కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, కడప, అనంతపురం, ఒంగోలు, గుంతకల్లు స్పీడ్ పోస్టు సదుపాయాన్ని పోస్టల్ శాఖ అందచేస్తఒంది. ఇక ఈ చెప్పిన 11 నగరాలకే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇతర 242 ప్రధాన పట్టణ తపాలా కార్యాలయాలలో కూడా ప్రజల సౌకర్యార్థం సాధారణ పని వేళలను 1 నుండి 2 గంటల వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీని వల్ల కస్టమర్ల రద్దీ తగ్గడమే కాకుండా సేవల నాణ్యత మరింత మెరుగుపడనుందని అధికారులు చెబుతున్నారు.

మారుతున్న కాలానికి : ఈ రోజుల కాలం వేగంగా పరిగెడుతోంది. ప్రజలు పూర్వం మాదిరిగా పోస్టల్ సేవల మీదనే ఆధారపడడం లేదు, ఇతర సేవలు ప్రైవేట్ రంగంలో విస్తరించి ఉన్నాయి. అందులో కొరియర్ సేవలు ఎక్కువగా ఉన్నాయి. దాంతో పోస్టల్ డిపార్ట్మెంట్ కూడా కాలానికి తగినట్లుగా తనను తాను మార్చుకుంటోంది. ప్రజలకు చేరువ అవుతోంది. ఈ క్రమంలోనే స్పీడ్ పోస్టులను సరికొత్తగా ప్రజలకు పూర్తిగా కనెక్ట్ అయ్యేలా తీసుకుని వస్తోంది. ఈ విధంగా కేవలం ప్రజలు మాత్రమే కాకుండా వ్యాపార సంస్థలకు ఉపయోగకరంగా తనను తాను మార్చుకుంటూ అందుబాటులోకి వేగవంతమైన సేవలను తెస్తోంది. ఆ విధంగా చూస్తే ఈ 11 నగరాలలో అందుబాటులో ఉన్న 24ఐ7 బుకింగ్ సౌకర్యాలను అలాగే ఏపీలో ఉన్న ఇతర 242 తపాలా కార్యాలయాలలో పొడిగించిన పని వేళలతో పోస్టల్ శాఖ ప్రజలను ఇంకా ఎక్కువగా ఆకట్టుకోవాలని చూస్తోంది.

# పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ

**హైదరాబాద్:** మావోయిస్టు కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి కూడా లొంగిపోయారు. ఈ మేరకు డీజీపీ శివధర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను ప్రకటించారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. "గత రెండేళ్లలో నలుగురు సీసీఎంలు, 16మంది ఎస్‌ఈఎంలు, 26మంది డివిజన్ కమిటీ సభ్యులు, సెక్రటరీలు.. 85 మంది ఏసీఎస్‌లు, 60 మంది పార్టీ సభ్యులు సహా మొత్తం 591 మంది జన జీవన స్రవంతిలోకి వచ్చారు. తెలంగాణలో పుట్టి, పెరిగిన 11 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. వాళ్లలో కొంతమంది మాతో చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే వారు కూడా బయటకు వస్తారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఎంతో మంది మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జన జీవన స్రవంతిలోకి వస్తున్నారు. అలా వచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు, పునరావాస ప్రయోజనాలు వెంటనే అందిస్తాం"

"మావోయిస్టుల లొంగుబాటులో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి, ఆమె టీమ్‌నకు నా అభినందనలు. ఐడీజీ ఇంటెలిజెన్స్ విజయ్‌కుమార్‌ను కూడా అభినందిస్తున్నా" అని తెలిపారు. ఈ సందర్భంగా దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డిల స్వస్థలం, విద్యాభ్యాసం, మావోయిస్టులుగా వారి ప్రయాణాన్ని డీజీపీ వివరించారు. జన జీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టుల హక్కుల కాపాడేందుకు ప్రయత్నిస్తామని అవసరమైతే వారి ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డు వేస్తామని డీజీపీ పునరుద్ఘాటించారు.

లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్రయోజనాలివే!



**తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం**

- తిపిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ: సెంట్రల్ కమిటీ సభ్యుడు (CCM) పొలిట్‌బ్యూరో సభ్యుడు (PBM)పై రూ. 25,00,000/- (ఇరవై ఐదు లక్షలు) నగదు బహుమతి.
- మల్ల రాజి రెడ్డి ఎలియాస్ సంగ్రామ్: సెంట్రల్ కమిటీ సభ్యుడు (CCM)పై రూ.25,00,000/- (ఇరవై ఐదు లక్షలు) నగదు బహుమతి.
- బడే చొక్కా రావు ఎలియాస్ దామోదర్: స్టేట్ కమిటీ సభ్యుడు (SCM)పై రూ.20,00,000/- (ఇరవై లక్షలు) నగదు బహుమతి.
- నూనె నర్సింహ రెడ్డి ఎలియాస్ గంగన్న: స్టేట్ కమిటీ సభ్యుడు (SCM)పై రూ.20,00,000/- (ఇరవై లక్షలు) నగదు బహుమతి.

రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల పునరావాస పథకం ప్రకారం, వీరికి లభించే మొత్తం రూ. 90,00,000/-(తొంబై లక్షలు) నగదు బహుమతిని డిమాండ్ డ్రాఫ్టు/చెక్కుల రూపంలో చెల్లించనున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ, తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం వీరికి లభించాల్సిన అన్ని ప్రయోజనాలను తక్షణమే అందిస్తారు. "మేము ప్రజల సమస్యలపై ప్రజల తరఫున ప్రజలతో కలిసి పనిచేస్తాం. పార్లమెంటరీ వ్యవస్థలోకి పోవాలనేది మా ఉద్దేశం కాదు. ప్రజల సమస్యలపై జరిగే పోరాటాలను సంఘటితం చేయడం కోసం చట్ట పరిధిలో పనిచేయాలని ఆలోచించాం. అవకాశం ఉన్నప్పుడల్లా ప్రజల పోరాటాల వెనుక నిలబడతామని హామీ ఇస్తున్నాం. మావోయిజం ఎప్పటికీ ముగిసిపోదు. ప్రపంచవ్యాప్తంగా అది అభివృద్ధి చెందుతూనే ఉంటుంది" -మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్.



# గోదావరిలో 'గోల్డ్ రష్' : గ్రామస్థుల వేట


**మహారాష్ట్ర :** నది ప్రవాహం తగ్గిపోతోందంటే పరివాహక రైతులు, మత్స్యకారులు సహా వాటిపై ఆధారపడే వారిలో కలవరం మొదలవుతుంది. కానీ, మహారాష్ట్రలోని పైఠణ్ పట్టంలో మాత్రం స్థానికుల కొత్త ఆశలకు ఊపిరి పోస్తుంది. అక్కడ ప్రవహించే గోదావరి నదిలో నీటి ప్రవాహం తగ్గడమే తరువాయి.. వలలు, జల్లెడలతో రంగంలోకి దిగతారు. బంగారం, ఇతర విలువైన వస్తువులు లభ్యమవుతాయనే ఆశతో అన్వేషణ మొదలుపెడతారు. ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో పైఠణ్ పట్టణాన్ని పవిత్ర ప్రదేశంగా భావిస్తారు. మరణించిన వారి కుటుంబ సభ్యులు, బంధువులకు ఇక్కడ అంతిమ సంస్కారాలు చేస్తుంటారు. అనంతరం వారికి సంబంధించిన ఆభరణాలు, నాణేలు, ఇతర విలువైన వస్తువులను అందులో వేస్తుంటారు. ఇలా వేసిన వాటిని గాలించి తీసుకునేందుకే చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఎగబడుతుంటారు.

**దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా HPV వ్యాక్సిన్!**

అక్కడ తాజాగా గోదావరి ప్రవాహం తగ్గడంతో సమీప గ్రామాల ప్రజలు నది ఒడ్డుకు చేరుకున్నారు. నడుములోతు ఉన్న నీటిలోకి దిగి.. జల్లెడలు, వలలతో విలువైన వస్తువుల కోసం వేట కొనసాగిస్తున్నారు. నది గర్భంలో బురదను తీసి జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో ఏదైనా విలువైన వస్తువు లభ్యమైతే దాన్ని భగవంతుడు తమకు ఇచ్చిన కానుకగా భావిస్తామని స్థానికులు పేర్కొనడం గమనార్హం.

# రూ.8లక్షలు అప్పు చేసి మరీ ఎయిర్ అంబులెన్స్ బుకింగ్

**రాంచీ :** కాలిన గాయాలతో విషమ పరిస్థితుల్లో ఉన్న రోగిని చికిత్స కోసం దిల్లీకి తరలించేందుకు రాంచీ నుంచి బయల్దేరిన ఎయిర్ అంబులెన్స్ సోమవారం రాత్రి కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రమాదానికి సంబంధించి మరికొన్ని విషయాలు బయటికొచ్చాయి. హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన సంజయ్‌కుమార్‌ను ఎలాగైనా కాపాడుకోవాలనే ఆలోచనతో.. అతడి కుటుంబం రూ.8 లక్షలు అప్పు చేసి మరీ ఈ ఎయిర్ అంబులెన్స్ బుక్ చేసినట్లు తెలుస్తోంది.



దర్యాప్తు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలోని చాంద్వా ప్రాంతానికి చెందిన సంజయ్‌కుమార్ (41) స్థానికంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. సోమవారం హోటల్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడి శరీరం 65శాతం కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం దిల్లీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని స్థానిక వైద్యులు సూచించారు. వీలైనంత త్వరగా బాధితుడిని తరలించడం కోసం అతడి కుటుంబం రూ.8 లక్షలు అప్పు చేసి.. రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ సీ90 ఎయిర్ అంబులెన్స్‌ను బుక్ చేసింది.

సంజయ్‌తో పాటు అతడి భార్య అర్చన, మరో కుటుంబసభ్యుడు, ఒక వైద్యుడు, ఒక పారామెడికల్ ఉద్యోగి, ఇద్దరు పైలట్లు ఎయిర్ అంబులెన్స్‌లో వెళ్లారు. సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో వీరంతా మృతి చెందారు. రాంచీ నుంచి బయల్దేరిన కొంత సమయం తర్వాత ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల పైలట్లు ఎయిర్ అంబులెన్స్‌ను కోల్‌కతాకు మళ్లించాలనుకున్నట్లు డీజీసీఏ పేర్కొంది. రాత్రి 7.34 గంటల సమయంలో ఏటీసీతో సంబంధాలు కోల్పోయిన కాసేపటికే ఈ ఎయిర్ అంబులెన్స్ కుప్పకూలిందని తెలిపింది.

# హెరిటేజ్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయదు : సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుల్లో భారతి సిమెంట్స్ వాడారు. నేరస్థులు ఏ విధంగా ప్రభుత్వంలో వ్యవహరిస్తారో అనేందుకు ఇదే ఉదాహరణ. నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ డెయిరీకి ముడిపెట్టేందుకు యత్నించారు. హెరిటేజ్ నిత్యం 20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తోంది. నెయ్యి విషయంలో ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్‌కు సంబంధంలేదు. పుణెలోని ఇందాపూర్ డెయిరీ అనేక కంపెనీలతో కో మ్యానుఫేక్చరింగ్ చేస్తుంది. హెరిటేజ్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయదు" అని సీఎం పునరుద్ఘాటించారు.

# గ్రూప్-I వ్యవహారంలో ఏపీ సీఎస్‌పై హైకోర్టు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

అర్హత సాధించి ఉద్యోగాల్లో చేరి విధులు నిర్వహిస్తున్నారో వారందరినీ ప్రాధాన్యత లేని పోస్టులకు పంపాలని సీఎస్‌ని ఆదేశించింది. ఇప్పటివరకు సీఎస్ ఆ ఆదేశాలు పాటించకపోవడంపై ప్రశ్నించింది. ఈ అంశంపై సుమోటోగా ధిక్కరణ కేసు ఎందుకు నమోదు చేయకూడదో చెప్పాలని అడిగింది. రేపు ఉదయం 10.30గంటలకు కోర్టుకు హాజరు కావాలని సీఎస్ ఆదేశించింది.

# ఏపీ క్యాబినెట్ కీలక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

వివిధ సంస్థలకు భూకేటాయింపుల అంశాల పైనా చర్చించి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. రాష్ట్రంలో కొత్తగా పాలనాపరమైన సౌలభ్యం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ పేరుతో నూతన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# కల్తీ నెయ్యి వ్యవహారం

## దోషులు ఎవరైనా శిక్ష పడాల్సిందే: పవన్

(మొదటి పేజీ తరువాయి)

అది నెయ్యే కాదని సీబీఐ రిపోర్టు ఇచ్చింది. ఇది ధర్మానికి సంబంధించిన విషయం. సకల మతాలను గౌరవించడం ఈ దేశ సంస్కృతి. తితిదే పాత బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు. అంటే ఆయనకూ భాగం ఉన్నట్టే కదా" అని పవన్ అన్నారు.

# కేరళ పేరు ఇక కేరళం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి భాజపా మద్దతు ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ సీఎంకు లేఖ రాశారు. దానికి ముఖ్యమంత్రి బదులిస్తూ.. "రాష్ట్రం అసలు పేరు కేరళం. కానీ బ్రిటిషర్లు తమ సౌకర్యం కోసం కేరళగా మార్చారు. వారు చేసిన మార్పులను రాష్ట్ర సంస్కృతికి అనుగుణంగా సరిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు.

**ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే..?**

ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే.. మార్పునకు ప్రతిపాదన చేస్తూ చేసిన తీర్మానానికి ఆ శాసనసభలో ఆమోదం లభించాలి. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకుంటారు. అయితే ఆ అభిప్రాయాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. తర్వాత రాష్ట్రపతి సిఫార్సు మేరకు పేరు మార్పు బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. ఆ బిల్లు ఆమోదానికి సాధారణ మెజార్టీ సరిపోతుంది. తర్వాత రాష్ట్రపతి ఆమోదముద్రతో పేరు అధికారికంగా మారుతుంది. ఈ ప్రక్రియకు రాజ్యాంగ సవరణ అవసరం లేదు. ఆర్టికల్ 3 ప్రకారం సాధారణ చట్టం ద్వారానే చేయవచ్చు. అనంతరం రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషల్లో మార్పులు చేస్తారు.

# నగ్న నిరసన సరే.. నిఘా ఫెయిల్యూర్ కాదా మోడీజీ?




**న్యూఢిల్లీ, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :**

పలువురు దేశాధినేతలు.. దిగ్గజ ఐటీ.. ఏఐ కంపెనీలకు చెందిన సీఈవోలు.. అధినేతలు హాజరైన ఏఐ సమిట్‌లో యువజన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలైన నలుగురు తాము చేపట్టిన నిరసనలో భాగంగా అర్ధనగ్న ప్రదర్శన చేయటం షాకింగ్‌గా మారింది. ఎందుకంటే.. అంతర్జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమానికి భద్రతా ఏర్పాట్లు ఎంత కట్టుదిట్టంగా.. భారీగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటప్పుడు ఒక జాతీయ పార్టీకి చెందిన నలుగురు సింపుల్‌గా ఎంట్రీ ఇచ్చేయటమే కాదు.. నేరుగా ఏఐ సమిట్ జరిగే ప్రదేశానికి వచ్చి.. అతిధులకు కూతవేటు దూరంలో నిరసన చేపట్టటం.. తమ చొక్కాలు విప్పదీసి నినాదాలు చేయటం కలకలాన్ని రేపింది.

ఈ తీరును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేయటమే కాదు.. ఏమిటీ నగ్న రాజకీయాలు అంటూ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. పోలీసులు సైతం ఈ నలుగురిని.. వీరికి సహకారం అందించిన మరో ముగ్గురితో పాటు మొత్తంగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడ ప్రశ్నేమంటే.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన కార్యక్రమానికి ఇంత సింపుల్‌గా ఎలా వెళ్లగలిగారు అదెలా సాధ్యమైంది అన్నప్పుడు నకిలీ క్యూఆర్ కోడ్‌లు.. నకిలీ పాస్ లతో ఎంట్రీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు.

ఒక్కసారి యూత్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల స్థానంలో కరుడుగట్టిన తీవ్రవాదుల్ని ఊహించుకోండి. వారు సైతం ఇదే తరహాలో లోపలకు ఎంట్రీ ఇచ్చారనే అనుకోండి. వారు తాము అనుకున్న లక్ష్యానికి చేరుకొని.. తాము ఏదైతే విధ్వంసాన్ని క్రియేట్ చేయాలని చూస్తే.. అన్న ప్రశ్నకు తడారిపోతుంది. టెన్షన్ పుట్టుకురావటం ఖాయం. ఇదంతా ఎందుకు చెప్పినట్లు అన్న క్వశ్చన్ రావొచ్చు. దానికి సమాధానం ఏమంటే.. యూత్ రాజకీయ నేతలు, కార్యకర్తలు కాబట్టి.. అనూహ్య నిరసనలు చేపట్టారు. అదే.. ఆ ముసుగులో భారత శత్రువులు ఎంట్రీ ఇచ్చి ఉంటే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న వస్తేనే హడలిపోవటం ఖాయం.

ఇలాంటి పరిస్థితి ఎందుకు ఎదురైంది దీనికి కారకులు ఎవరు? అన్న ప్రశ్నలు మదిలో మెదిలితే.. కేంద్రంలోని మోడీ సర్కారు గుర్తుకు రాక మానదు. ఎందుకంటే..ఈ తరహా నిరసనను నిఘా వర్గాలు ఎందుకు పసిగట్టకలేకపోయాయి. అన్నది ఒక ప్రశ్న అయితే.. మరో అంశం తప్పుడు క్యూఆర్ కోడ్‌లతో ఎలా ఎంట్రీ అయ్యారు. అలాంటి తప్పుల్ని.. మోసాల్ని గుర్తించాల్సిన వ్యవస్థలు ఎందుకు ఫెయిల్ అయ్యాయి అన్నది ప్రశ్నలు. ఇంత సింపుల్‌గా.. ఎంతో ప్లాన్‌తో వేసిన ఈ పథకం అమలును చూస్తే.. మన నిఘా వ్యవస్థ.. మన సెక్యూరిటీ వ్యవస్థలోని లోపాలు ఇట్టే కనిపిస్తాయి. అలాంటప్పుడు ఈ వైఫల్యానికి బాధ్యులుగా ఎవరిని నియమించారు అన్నది అన్నింటికంటే పెద్ద ప్రశ్న. రాజకీయ శత్రువులపై విమర్శలు గుప్పించటం.. వారి తీరును ప్రశ్నించే కన్నా.. భద్రతా లోపాలు కుప్పలుకుప్పలుగా ఉన్న విషయాన్ని ప్రధాని నరేందర మోడీ ఫోకస్ చేస్తే మంచిది. అదే సమయంలో భద్రతా లోపాలకు కారణమైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై కూడా వివరణ ఇవ్వటం మంచిదిగా చెప్పక తప్పదు.




VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్



అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250



Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 130 విశాఖపట్నం, 25 ఫిబ్రవరి 2026 బుధవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00


# ఏపీ క్యాబినెట్ కీలక భేటీ

## 55 అజెండా అంశాలపై చర్చ

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో సమావేశమైంది. దాదాపు 55 అజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలపనుంది. తొలుత 36 అజెండా అంశాలే అనుకున్నప్పటికీ.. అజెండాలో 55 అంశాలను చేరుస్తూ క్యాబినెట్ సుదీర్ఘంగా చర్చించనుంది. ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. అలాగే, విశాఖ, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి, చీరాల, సత్యసాయి జిల్లాల్లోని పలు పర్యాటక ప్రాజెక్టులకు, మరీ ముఖ్యంగా ఆతిథ్య రంగంలో పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపనున్నట్లు తెలుస్తోంది. అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో కొత్త ప్రాజెక్టులు, నెల్లూరు జిల్లాలో మహిళల కోసం కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల




ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విశాఖలో సెమీ కండెక్టర్ పరిశ్రమ ఏర్పాటు ⏭ తరువాయి 2లో..



# మంత్రి నారా లోకేశ్ పనితీరుపై హైకోర్టు ప్రశంస

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :** ఏపీ మంత్రి నారా లోకేశ్ పని తీరును హైకోర్టు ప్రశంసించింది. కస్తూర్బా పాఠశాలల టీచర్ల జీతం పెంచుతామన్న ప్రకటనను అభినందించింది. పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తామని మంత్రి ప్రకటన చేశారని వ్యాఖ్యానించింది. ప్రజా సమస్యలపై మంత్రి లోకేశ్ వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారని తెలిపింది. హాస్టల్ విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటనపై వెంటనే స్పందించారని కితాబిచ్చింది. అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారంటూ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

## రూ.8లక్షలు అప్పు చేసి మరీ ఎయిర్ అంబులెన్స్ బుకింగ్

2 లో



## కల్తీ నెయ్యి వ్యవహారం

## దోషులు ఎవరైనా శిక్ష పడాల్సిందే: పవన్

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :** కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే శిక్ష పడాల్సిందేనని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. "కల్తీనెయ్యిలో ఏ రసాయనాలు వాడారో ఆ పెరుమాళ్లకే తెలియాలి. జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పింది. ⏭ తరువాయి 2లో..

# కేరళ పేరు ఇక కేరళం


## కేంద్ర క్యాబినెట్ ఆమోదం




**కేరళ :** దేవుడి సొంత భూమిగా పిలిచే కేరళ పేరు మారనుంది. ఈ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చేదిశగా కీలక అడుగుపడింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పేరు మార్పుపై కేంద్రాన్ని అభ్యర్థిస్తూ ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు చేసిన సంగతి తెలిసిందే. అధికారిక రికార్డుల్లో రాష్ట్రం పేరును సవరించాలంటూ తీసుకువచ్చిన తీర్మానానికి ఇటీవల కేరళ శాసనసభ ఆమోదం తెలపగా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ దానిని పరిగణనలోకి తీసుకుంది. ఈ ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కేరళ పేరు మార్పుపై తొలిసారి 2023లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. తమ రాష్ట్రం పేరును పూర్వం నుంచే మలయాళంలో 'కేరళం' అని పిలిచేవారని అప్పట్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ గుర్తు చేశారు. కానీ, ఇతర భాషల్లో మాత్రం కేరళ అని పిలుస్తున్నారని ఆయన తెలిపారు. కాగా.. ఈ విషయంలో విజయన్ ⏭ తరువాయి 2లో..

# కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారు: సీఎం చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :** వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మహాపాపం' పేరిట వైకాపా హయాంలో లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు.

"రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించింది. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించాం. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారు. 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారు. రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలింది. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని నేను సొంతంగా ఏమీ చెప్పలేదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పా. ఆ భగవంతుడే నాతో చెప్పించాడు" అని చంద్రబాబు అన్నారు.

### అవన్నీ ఈవో, ఛైర్మన్‌కు తెలియకుండా జరుగుతాయా?

"వారికి అనుగుణంగా నిబంధనలన్నీ సడలించారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధన తొలగించారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించారు. రోజుకు 12 టన్నులుగా ఉండాల్సిన వెన్న తయారీ ఎనిమిది టన్నులకు తగ్గించారు. డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. పోమిల్ జైన్, విపిన్ జైన్, భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ ప్రధాన సూత్రధారులు. నెయ్యి సరఫరా చేసిన షెల్ కంపెనీలు ఏఆర్ డెయిరీ ఫుడ్స్, శ్రీవైష్ణవి డెయిరీ, మాల్ గంగా మిల్క్ డెయిరీ. భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలు సహకరించాయి. లంచం డబ్బుతో చిన్నప్పన్న దొరికిపోయారు. కల్తీ నెయ్యి సరఫరాదారులకు చిన్నప్పన్న సహకారం అందించారు. తప్పుడు రిటర్నులతో బురిడీ కొట్టించారు. ల్యాబ్ నివేదిక ఫోర్జరీ చేశారు. ఇన్ని జరిగితే తితిదే బోర్డు ఈవో, ఛైర్మన్‌కు తెలియకుండా జరుగుతాయా? ప్రసాదం తీసుకున్న ప్రతి ఒక్కరూ నాణ్యత తగ్గిందని చెప్పారు" అని సీఎం తెలిపారు.

## వెంటనే లొంగిపోవాలి

# అవినాష్‌రెడ్డికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ



**దిల్లీ:** వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. దర్యాప్తు అధికారి ఎదుట లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అవినాష్ విజ్ఞప్తిని తోసిపుచ్చిన అత్యున్నత న్యాయస్థానం.. పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దర్యాప్తు అధికారి ఎదుట లొంగిపోయిన తర్వాత ట్రయిల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోచ్చని సూచించింది.

# నెయ్యి సేకరణ - కఠిన నిబంధనలను మార్చిందెవరు : ధూళిపాళ్ల

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :** వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత కంపెనీలకు దోచిపెట్టారని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. తిరుమల నెయ్యి సేకరణకు సంబంధించిన కఠిన నిబంధనలను మార్చిందెవరని ఆయన ప్రశ్నించారు. రోజుకు 4లక్షల లీటర్ల సామర్థ్యం నిబంధనను తీసేశారని.. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తీసుకొచ్చారని చెప్పారు. డెయిరీ అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి తీసుకొచ్చారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ధూళిపాళ్ల మాట్లాడారు. "నిబంధనలు సడలింపు చేయడంతో తమకు కావాల్సిన ప్రైవేటు వ్యాపారులకు టెండర్లు ఇచ్చేందుకు పునాది పడింది. ఒక మహాపాపం, దోపిడీకి ఆనాడే తెరలేపారు. కల్తీ నెయ్యిని ఏటా సరఫరా చేశారు. నాటి ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం



లేకపోతే తిరుమలలో ఐదేళ్లపాటు కల్తీ నెయ్యి సరఫరా సాగుతుందా? వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు?" అని ఆయన ప్రశ్నించారు.

# గ్రూప్-I వ్యవహారంలో ఏపీ సీఎస్‌పై హైకోర్టు ఆగ్రహం

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :** ఏపీపీఎస్సీ గ్రూప్-1 వ్యవహారంలో సీఎస్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయనందుకు మండిపడింది. గ్రూప్ 1 పరీక్షల వాల్యుయేషన్‌కు సంబంధించిన కేసుపై మంగళవారం విచారణ చేపట్టిన సందర్భంగా సీఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. గత విచారణలో గ్రూప్ 1 పరీక్షలకు సంబంధించిన అవకతవకలపై ప్రత్యేక సిట్



ఏర్పాటు చేసి విచారణ కొనసాగించాలని, ఎవరైతే ఆ నోటిఫికేషన్‌లో ⏭ తరువాయి 2లో..

## మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం: మంత్రి అనిత



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :** మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ హోంమంత్రి అనిత ప్రకటించారు. ఎవరైనా ఆడపిల్లల జోలికొస్తే అదే వారికి చివరి రోజు అనే సందేశం ప్రజల్లోకి పంపామని గుర్తుచేశారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో నేరాలు పెరిగాయన్న వైకాపా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపణలను.. శాసనమండలిలో మంత్రి అనిత తిప్పికొట్టారు. గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని, డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని అనిత తెలిపారు.

## హెరిటేజ్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయదు : సీఎం చంద్రబాబు

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 24 :** కల్తీ నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ సంస్థతో ముడి పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తుండటంపై సీఎం చంద్రబాబు స్పందించారు. హెరిటేజ్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయదని స్పష్టం చేశారు. ఈ మేరకు హెరిటేజ్ అంశంపై అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. "హెరిటేజ్ సంస్థ మా కుటుంబ వ్యాపార సంస్థ. ప్రభుత్వ సంస్థలకు ఎక్కడా మా ఉత్పత్తులు సరఫరా కాలేదు. హెరిటేజ్ నుంచి కిలో నెయ్యి కూడా ప్రభుత్వ శాఖలు కొనలేదు. ఆ




పత్రికలో మాత్రం హెరిటేజ్‌కు వ్యతిరేకంగా కథనాలు రాశారు. ప్రభుత్వ సహకారం లేకుండా ఆ సంస్థ నిజాయతీగా వ్యాపారం చేస్తోంది" అన్నారు. "గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలు ⏭ తరువాయి 2లో..

విశాఖ సమాచారమ్
బుధవారం 25-2-2026

# పతనం దిశగా ప్రజాస్వామ్యం!

స్థానిక ప్రభుత్వాల ద్వారానే గాంధీజీ కలలుగన్న 'గ్రామ స్వరాజ్యం' సాధ్యమవుతుందని ఆశించి చేసిన 73, 74 రాజ్యాంగ సవరణలు నేడు కాగితాలకే పరిమితమవు తున్నాయి. అధికార వికేంద్రీకరణ జరిగి పాలన ప్రజల ముంగిట ఉండాలనేది ఈ చట్టాల అసలు ఉద్దేశ్యం. కానీ, నేడు ఆదర్శాలు మరుగునపడి, స్థానిక సంస్థలు కేవలం రాజకీయ చదరంగంలో పావులుగా మారిపోయాయి.. దీనికి బాధ్యులు ఎవరు అనే ప్రశ్నకు సమాధానం ఒకరి మీద ఒకరు నెట్టేయడం కంటే, ఇది వ్యవస్థీకృత వైఫల్యం అని అంగీకరించాలి. ఈ పరిస్థితిలో అత్యంత విషాదకరమైన అంశం ఏమిటంటే ఎన్నికల వ్యయం. ఓటమి భారంతో కుంగిపోతున్న అభ్యర్థులు గెలుపు కోసం ఆస్తులు అమ్ముకుని, అప్పులు తెచ్చి కోట్లు కుమ్మరిస్తున్న అభ్యర్థులు, ఓడిపోయాక దిక్కుతోచని స్థితిలోకి వెళ్తున్నారు. పెట్టిన పెట్టుబడి రాలేదనే ఆవేదన, సమాజంలో పరువు పోయిందనే అవమానం వారిని ఆత్మహత్యలవైపు ప్రేరేపిస్తున్నాయి. ఒక వ్యక్తి సేవ చేయడానికి సిద్ధపడితే, ఆ ప్రయత్నం అతడిని చితి వరకు తీసుకెళ్లడం మన వ్యవస్థ ఎంతగా దిగజారిందో తెలియజేస్తోంది. పెట్టుబడిగా రాజకీయం అధికారం అంటే సేవ కాదు, అదొక 'పెట్టుబడి' అనే ధోరణి పెరిగింది. గెలిచిన వారు పెట్టిన సొమ్మును వడ్డీతో సహా రాబట్టాలని అవినీతికి పాల్పడుతుంటే, ఓడిన వారు ఆర్థికంగా చితికిపోయి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు.. ప్రజల బాధ్యతారాహిత్యం ఓటును అమ్ముకోవడం ద్వారా ప్రజలు తమ ప్రశ్నించే హక్కును కోల్పోతున్నారు. డబ్బు ఇచ్చే నాయకుడిని ఎంచుకున్నప్పుడు, అభివృద్ధి గురించి అడిగే నైతిక అర్హతను వారు వదులుకుంటున్నారు. ఎందరో మహానుభావులు ప్రాణత్యాగం చేసి అందించిన ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందాలంటే, స్థానిక సంస్థలకు జీవం పోయాలి. అధికారం అంటే ఆధిపత్యం కాదు, అది అట్టడుగు ప్రజల అభివృద్ధికి వేసే బాట అని గుర్తించాలి. ఓటుకు నోటు ఇచ్చే సంస్కృతిని ప్రజలు బహిష్కరించినప్పుడే, నిజాయితీ గల వ్యక్తులు రాజకీయాల్లోకి వస్తారు. మార్పు మన ఇంటి నుండే, మన ఓటుతోనే మొదలవ్వాలి.

# స్థితప్రజ్ఞత' సాధించడం ఎలా?

స్థితప్రజ్ఞత అంటే భావోద్వేగాలు లేకపోవడం కాదు, భావోద్వేగాలు మనల్ని శాసించకుండా చూసుకోవడం.

ఎందుకు స్థితప్రజ్ఞత అవసరం?

1. మానసిక ప్రశాంతత: భావోద్వేగాల తీవ్రత తక్కువగా ఉన్నప్పుడు మనం సరైన నిర్ణయాలు తీసుకోగలం.
2. నిరంతర ప్రయాణం: ఫలితం ఏదైనా, మన పని మనం చేసుకుంటూ పోయినప్పుడే దీర్ఘకాలిక విజయం లభిస్తుంది.
3. ఆరోగ్యం: అతిగా స్పందించడం వల్ల కలిగే ఒత్తిడి (హ్రీవంం) తగ్గుతుంది.

జీవిత గమనంలో గెలుపోటములను సమానంగా స్వీకరించడం అనేది ఒక గొప్ప కళ.

జీవితంలో నిలకడ (జశీఅంఱర్‌వఅషఎ)

గెలిచినప్పుడు ఆకాశానికి ఎగిరిపోకుండా, ఓడినప్పుడు పాతాళానికి కుంగిపోకుండా ఉండటమే పరిణతి.

లి గెలుపు: ఇది కేవలం ఒక మైలురాయి మాత్రమే, గమ్యం కాదు. ఇది మన కృషికి లభించిన గుర్తింపు.

లి ఓటమి: ఇది ఒక పాఠం. ఎక్కడ తప్పు జరిగిందో సరిదిద్దుకోవడానికి ప్రకృతి ఇచ్చే అవకాశం.

జీవితం ఒక అల లాంటిది; ఎగసినప్పుడు పొంగిపోకుండా, పడినప్పుడు కుంగిపోకుండా ఆ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడటమే అసలైన విజయం.

ఆచరణలో పెట్టడం ఎలా?

"సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ" ు (భగవద్గీత)

సుఖం-దుఃఖం, లాభం-నష్టం, గెలుపు-ఓటములను సమానంగా చూడాలి.

లి గెలిచినప్పుడు: ఈ విజయం వెనుక ఉన్న శ్రమను, మీకు సహకరించిన వ్యక్తులను గుర్తుంచుకోండి. ఇది గర్వాన్ని తగ్గిస్తుంది.

లి ఓడినప్పుడు: ఇది శాశ్వతం కాదని గుర్తించండి. "ఇది కూడా గడిచిపోతుంది" (్ష్రఱం్‌ శీశీ ంష్ఠుశ్రీశ్రీ జూఖంం) అనే సూత్రాన్ని నమ్మండి.

అయినా స్థితప్రజ్ఞతను అలవర్చుకోవడం అనేది ఒక రోజులో సాధ్యమయ్యేది కాదు, అది నిరంతర సాధనతో కూడిన ప్రయాణం.

ప్రాక్టికల్ టిప్స్ (ృతీఅష్ఠుఅఙశ్రీ ుఱజూం)

1. సాక్షిగా ఉండటం (ూఎంవతీఱఞ్‌ఱశీఅ):
మీకు ఏదైనా గొప్ప విజయం వచ్చినప్పుడు లేదా బాధ కలిగించే ఓటమి ఎదురైనప్పుడు, వెంటనే స్పందించకుండా (=ఙుష్‌) ఒక్క నిమిషం ఆగండి. ఆ భావోద్వేగాన్ని ఒక మూడవ వ్యక్తిలా గమనించండి. "నేను ఇప్పుడు చాలా ఆనందంగా ఉన్నాను" లేదా "నేను ఇప్పుడు బాధపడుతున్నాను" అని మీకు మీరు చెప్పుకోవడం వల్ల ఆ భావోద్వేగం మీపై పూర్తి నియంత్రణ కోల్పోతుంది.
2. ఫలితంపై వ్యామోహం వీడటం:
మీరు చేసే పని మీద మాత్రమే దృష్టి పెట్టండి. ఫలితం వస్తే అది బోనస్, రాకపోతే అది ఒక అనుభవం. "నేను నా వంతు కృషి చేశానా?" అన్నది మాత్రమే ముఖ్యం.
3. దినచర్యలో నిలకడ (=శీబ్‌ఱఅవ):
గెలిచినా, ఓడినా మీ రోజువారీ పనులను (వ్యాయామం, ధ్యానం, పని) ఆపకండి. క్రమశిక్షణతో కూడిన దినచర్య మన మనస్సును నిలకడగా ఉంచుతుంది.
4. కృతజ్ఞత (+తీీఞ్‌ఱబఎవ):
ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ రోజు జరిగిన మూడు మంచి విషయాలను రాసుకోండి. ఇది మీ మెదడును సానుకూలత వైపు మళ్ళిస్తుంది.

చదవాల్సిన ముఖ్యమైన పుస్తకాలు (వీబర్‌-=ఙుఎ దీశీశీఎం)

ఈ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ఈ క్రింది పుస్తకాలు మీకు ఎంతో సహాయపడతాయి:

భగవద్గీత: స్థితప్రజ్ఞతకు ఇది మూల గ్రంథం. కర్మ సిద్ధాంతం గురించి అద్భుతంగా వివరిస్తుంది.

మార్కస్ అరేలియస్ (ఙుతీషబం ూబతీవశ్రీఱబం) రచించిన వీవఎ- ఞ్‌ఱశీఅం: స్టోయిసిజం (హ్రీఱషఎఱంఎ) అనే పాశ్చాత్య తత్వశాస్త్రం ద్వారా భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలో చెబుతుంది.

విక్టర్ ఫ్రాంక్ల్ (ఎఱఅఞ్‌శీతీ ఖీతీఙుఅఱశ్రీ) రచించిన ఙుఅ'ం ూఙుతీఎష్ట్ర టశీతీ వీఙుఅఱఅస్త్ర:

అత్యంత దారుణమైన పరిస్థితుల్లో కూడా మనస్సును ఎలా నిలకడగా ఉంచుకోవాలో ఒక మనస్తత్వవేత్త అనుభవాల ద్వారా నేర్చుకోవచ్చు.

ర్యాన్ హాలిడే (=ఙుఅ నశీశ్రీఱఙుఎ) రచించిన ్ష్రవ ూఎర్‌ఙుఎశ్రీవ అం ్ష్రవ ఔఙుఎ: అడ్డంకులను అవకాశాలుగా ఎలా మార్చుకోవచ్చో ఆధునిక ఉదాహరణలతో వివరిస్తుంది

కృషి ఫలించి.. కాలం కలిసొచ్చి కొన్నిసార్లు మనం గెలుస్తాం. అప్పుడు అద్భుతమైన అనుభూతి కలుగుతుంది. కానీ అది కొద్దిసేపే, శాశ్వతంగా కాదు. కృషి సరిపోక.. కాలం కలిసిరాక ఇంకొన్నిసార్లు ఓడిపోతాం. అప్పుడు ప్రతికూల అనుభూతిని పొందక తప్పదు.

అయితే అదీ కొద్దిసేపే.. శాశ్వతం కాదు. సో, గెలుపోటములు వస్తుంటాయి, పోతుంటాయి. ఆ రెంటి విషయాల్లో మీరెంత నిలకడగా పని చేస్తున్నారన్నదే అన్నింటికంటే ముఖ్యం. సింపుల్గా చెప్పాలంటే పొంగిపోవద్దు, కుంగిపోవద్దు. అంటే, దేన్నైనా ఎంత తీసుకోవాలో అంత తీసుకోవడమే -స్థితప్రజ్ఞత.

దీన్ని అందరూ సాధించాలి, అప్పుడే జీవితం ఆనందంగా సాగుతుంది.

డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వర రావు
మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం
మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం.

# పుష్పక వైభోగం...రావణుడి విలాసం

రావణాసురుడి శయన మందిరాన్ని హనుమ పరికించాడు. గోడలకి కాగడాలు పెట్టబడి ఉన్నాయి. ఆయన పడుకునే తల్పం బంగారంతో చేసారు. దాని మీద పడుకున్న స్త్రీలు ధరించిన ఆభరణాలు ఎర్రటి బంగారంతో ధగధగలాడుతున్నాయి. రావణాసురుడి ఆభరణాలు బంగారంతో చేయడంతో మిలమిల మెరుస్తున్నావు. గోడలకి ఉన్న కాగడాల కాంతి, స్త్రీల ఆభరణాల కాంతితో కలిసి, మంటలాంటి ఎర్రటి కాంతి ఆ ప్రదేశాన్ని ఆవరించింది.

అక్కడ పడుకున్న స్త్రీలు ఒకరి మీద ఒకరు చెయ్యి వేసుకుని, ఒంటి మీద వస్త్రాలు చెదిరి పడుకొని ఉన్నారు. అందరి ముఖాలు పద్మాల్లా ఉన్నాయి. అలా కొన్ని వేల స్త్రీలు మదవిహ్వాలులై, రావణాసురుడితో కామోప భోగాన్ని అనుభవించి, విశేషమైన మద్యపానం చేసి, మత్తెక్కి, బడలి నిద్రపోతున్నారు. వారు తక్కువ జాతిలో జన్మించినవారు కాదు. ఎవరూ సౌందర్యం తక్కువైనవారు కాదు. వేరొక పురుషుడిని పొందినవారు కాదు. నడువడి తెలియనివారు కాదు. వీళ్ళందరూ రావణుడిని కోరుకుని వచ్చినవారు.

రావణుడి తల్పానికి వైఢూర్యాలతో మెట్లు కట్టబడి ఉన్నాయి. పడుకుని ఉన్న రావణుడికి ఉత్తమమైన స్త్రీలు సువాసనలు వెదజల్లే చామరాలు వీస్తున్నారు. ఆ తల్పం మీద పరుపుపై రావణుడు పడుకొని ఉన్నాడు. హనుమ రావణుడి తల్పం దగ్గరికి వెళితే, రావణుడి రోమ కూపాల నుండి కొడుతున్న బ్రహ్మతేజస్సు చేత అవతలకి తోయబడ్డాడు. అప్పుడు హనుమంతుడు దూరంగా వెళ్ళి ఒక వేదిక మీదనుండి రావణుడిని చూసాడు. "ఆకాశంలో వెళ్ళిపోతున్న ఒక నల్లటి మబ్బు భూమి మీదకి దిగిపోయి తల్పం మీద పడుకుంటే ఎలా ఉంటుందో, రావణుడు అలా" ఉన్నాడు. ఆయన పెట్టుకున్న కుండలాలు ప్రకాశిస్తున్నాయి. ఆయన అనుభవించిన సుఖం చేత, తాగిన మద్యం చేత తిరుగుడుపడుతున్న ఎర్రటి నేత్రాలతో ఉన్నాడు. అరమోడ్పు కన్నులతో, పెద్ద చేతులతో, మంచి వస్త్రాలు కట్టుకొని నిద్రపోతున్నాడు. దేవేంద్రుడి వాహనమైన ఐరావతం తన దంతాలచేత కుమ్మితే ఏర్పడిన గాయాలు రావణుడి శరీరం మీద కనపడుతున్నాయి. అలాగే

శ్రీమహావిష్ణువు తన చక్రం చేత కొట్టినప్పుడు ఏర్పడిన మచ్చలు ఉన్నాయి. దేవేంద్రుడు తన వజ్రాయుధం చేత కొట్టినప్పుడు తగిలిన దెబ్బలు కనపడుతున్నాయి. ఆ రావణుడు బాగా బలిసిన భుజాలతో ఉన్నాడు, ఆయన చేతి గోళ్ళు ఎర్రటి కాంతితో మెరిసిపోతున్నాయి. తల్పం మీద, పడుకొని ఉన్న పాములా ఉన్నాడు. ఆయన చేతులు పరిఘులలా ఉన్నాయి, ఆయన చేతులకి ఉన్న వేళ్ళు రెండు అయిదు తలల పాముల్లా ఉన్నాయి.

తరువాత హనుమ అక్కడ పడుకొని ఉన్న స్త్రీలని వెతికాడు. అక్కడ పడుకుని ఉన్న స్త్రీలలో ఒకామె మృదంగాన్ని గట్టిగా పట్టుకొని పడుకుంది, ఒకామె వేణువు ఊదుతూ నిద్రపోయింది.ఒకామె వీణ వాయిస్తూ నిద్రపోయింది. ఒకామె పక్కన ఉన్న స్త్రీ మీద చీరని తీసి తన మీద దుప్పటిగా కప్పుకుంది. ఆ స్త్రీలు అక్కడున్న సంగీత వాయిద్యాలని గట్టిగా కౌగలించుకొని, వాటిని రావణుడిగా భావించి చుంబిస్తున్నారు. అక్కడ ఒక్క స్త్రీ ఒంటి మీద ఆభరణం కాని, వస్త్రం కాని సరిగ్గా లేదు. అలా పడుకొని ఉన్న స్త్రీలందరినీ హనుమంతుడు చూసుకుంటూ వెళ్ళాడు.

రావణుడికి కొంత దూరంలో, బంగారు తల్పం మీద అపారమైన సౌందర్యవతి పడుకొని ఉంది. ఆవిడ రావణుడి భార్య మండోదరి. ఆవిడని చూడగానే 'ఈవిడే సీతమ్మ' అని హనుమంతుడు అనుకొని, తన భుజాలని కొట్టుకుని, తోకని ముద్దు పెట్టుకుని, విచిత్రమైన పాటలు పాడి, పిల్లిమొగ్గలు వేసి, గెంతులు వేసి, స్తంభాల పైకి ఎక్కి, కిందకి దూకి తన కోతి బుద్ధిని బయట పెట్టుకున్నాడు.

కొంతసేపటికి ఆయన తేరుకుని "మా అమ్మ సీతమ్మ, రాముడు పక్కన లేనప్పుడు ఇటువంటి పట్టు పుట్టం కట్టుకొని, పక్కన రావణుడు ఉండగా ఇంత హాయిగా నిద్రపోతుందా. అరరే నా బుద్ధి ఎంత వైక్లవ్యాన్ని పొందింది. ఈమె సీతమ్మ కాదు!" అనుకొని ముందుకి సాగిపోయాడు.

అక్కడినుండి ముందుకి వెళ్ళగా, రకరకాలైన బంగారు పాత్రలు, వెండి పాత్రలు, మణిమాణిక్యాలు పొదిగిన పాత్రలు, పువ్వులనుండి తీసిన సుర, పళ్ళనుండి తీసిన సుర, తేనెనుండి తీసిన సురలు మధురమైన వాసనలు వెదజల్లుతూ ఉన్నాయి. అక్కడ తాగేసిన పాత్రలు, సగం తాగి కిందపడేసిన పాత్రలు, స్త్రీపురుషులు ఒకరిమీద ఒకరు ఉండరాని విధంగా మత్తులో పడి ఉన్నారు. హనుమంతుడు వాళ్ళందరినీ చూసుకుంటూ ముందుకు వెళ్ళాడు. అప్పుడాయన అందరూ ఆహారం తీసుకునే ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ నెమళ్ళ మాంసం, కోళ్ల మాంసం, మేకల మాంసం, గొర్రెల మాంసం, అడవిపందుల మాంసం అలా రకరకాలైన పదార్థాలు ఉన్నాయి. హనుమ ఆ ప్రాంతాన్నంతటినీ వెతికారు. మళ్ళీ పుష్పక విమానంలోకి వెళ్ళి, అందులో వెతికి కిందకి దిగుతూ అనుకున్నారు "ఈ లంకా పట్టణం అంతా వెతికాను. ఇందులో వెతకని ఇల్లు లేదు. ఇక్కడ గంధర్వ, యక్ష, కిన్నెర స్త్రీలు, రాక్షసులు కనపడుతున్నారు కాని సీతమ్మ తల్లి జాడ కనిపెట్టలేకపోయాను" అని బాధ పడ్డాడు.

కాని వెంటనే "ఎవడు శోకానికి లొంగిపోడో, ఎవడు నిరంతరం ఉత్సాహంతో ఉంటాడో, వాడు మాత్రమే కార్యాన్ని సాధించగలడు. అందుకని నేను శోకానికి లొంగను, మళ్ళీ సీతమ్మని అన్వేషిస్తాను, మళ్ళీ ఈ లంకా పట్టణం అంతా వెతికేస్తాను" అని ఉత్సాహాన్ని పొంది లంకా పట్టణం అంతా వెతికి కూర్చున్నాడు.

అప్పుడాయన అనుకున్నాడూ

"ఇంత లంకా పట్టణాన్ని 4 అంగుళాలు కూడా వదలకుండా నేను వెతికాను, అయినా నాకు సీతమ్మ దర్శనం కాలేదు. బహుశా ఒంటి మీద వస్త్రాలు లేని స్త్రీలని ఎందరినో ఈ లంకా పట్టణంలో నేను చూశాను, అందువలన నాయందు ధర్మానికి లోపం వచ్చిందేమో. నేను వెతుకుతున్నది సీతమ్మని, ఆమె ఒక స్త్రీ. అందువలన ఆమెని వెతుకుతున్నప్పుడు సీతమ్మో కాదో అని ఆ స్త్రీల వంక చూశాను. ఆ స్త్రీలని అలా చూశాను కాని, నా మనసునందు ఎటువంటి వికారం కలగలేదు. నాకు ఎవరూ గుర్తులేరు. నేను పవిత్రంగానే ఉన్నాను" అని హనుమ తన మనస్సులో భావన చేసి, "నేను సీతమ్మ దర్శనం చెయ్యలేకపోయాను. ఇప్పుడు నేను వెనక్కి వెళితే అక్కడ ఉన్న వానరాలు నన్ను 'సీతమ్మ దర్శనం చేశావా?' అని అడుగుతారు. 'నాకు సీతమ్మ జాడ తెలియలేదు' అని చెప్తాను. సీతమ్మ జాడ తెలీకుండా వెనక్కి వెళితే సుగ్రీవుడు చంపేస్తాడని అందరూ ప్రాయోపవేశం చేస్తారు. ఈ మాట సుగ్రీవుడికి చెబితే, మిత్రుడైన రాముడికి సహాయం చెయ్యలేకపోయానని ప్రాణం వదిలేస్తాడు. దాంతో రాముడు కూడా ప్రాణం వదిలేస్తాడు. రాముడు లేనప్పుడు లక్ష్మణుడు ఉండడు. అప్పుడు అక్కడున్న వానరకాంతలు,వానరులు మరణిస్తారు. ఈ వార్త అయోధ్యకి చేరి కౌసల్య, కైకేయి, సుమిత్ర, భరతుడు, శత్రుఘ్నుడు మరణిస్తారు. తరవాత అయోధ్యలో అందరూ మరణిస్తారు. నేను పట్టుకెళ్ళే వార్త వల్ల ఇంత మంది మరణిస్తారు. ఈ వార్తని నేను తీసుకువెళితే ఎంత వెళ్ళకపోతే ఎంత.

బహుశా రావణుడు సీతమ్మని తీసుకువస్తున్నప్పుడు, ఆయన ఒడిలోంచి సీతమ్మ జారి సముద్రంలో పడిపోయి ఉంటుంది. కాదు కాదు, సీతమ్మ అంత పిరికిది కాదు. తన పొన్పు చేరడంలేదని, రావణుడే సీతమ్మని ముక్కలుగా నరికి ఫలహారంగా తినేసుంటాడు.కాదు కాదు, కాముకుడైనవాడు తాను కామించిన స్త్రీని సంహరించడు. లేకపోతే రాక్షసులు సీతమ్మని తినేసుంటారు.కాదు కాదు, రావణుడు కామించిన స్త్రీని తినగలిగే ధైర్యం రాక్షసులకు ఉండదు. రాముడికి సీతమ్మ జాడ తెలియకూడదని రావణుడే అమ్మని ఎక్కడో దాచి ఉంటాడు. నిద్రపోతున్న రావణుడి పది తలలు గిల్లేసి, వాడి మృతకళేబరాన్ని రాముడి పాదాల దగ్గర పడేస్తాను. లేదా ఈ లంకని పెల్లఘించి పట్టుకుపోతాను. కాదు కాదు, సీతమ్మ జాడ చెప్పలేనప్పుడు ఇవన్నీ తీసుకువెళ్ళడం ఎందుకు, అందుకని నేను అసలు వెనక్కి వెళ్ళను. సీతమ్మ జాడ దొరికేవరకు వానప్రస్థుడిలా ఇక్కడే ఉంటాను. లేదా అగ్నిలోకి ప్రవేశిస్తాను, లేదా నీటిలోకి ప్రవేశించి శరీరాన్ని వదిలేస్తాను" అనుకున్నాడు.

కాని వెంటనే "ఛీ! మరణించడం ఏమిటి, ఆత్మహత్య మహా పాపం. మళ్ళీ ఉత్సాహాన్ని పొంది వెతుకుతాను" అనుకొవడంతో మనస్సు ప్రశాంతి పొందింది.

**.యమ్వీఆర్**

# మహాభారత అనువాద విశ్వరూపం

మహాభారతం భారతీయ జన జీవన సంఘర్షణకు నిలువుటద్దం.భారతీయ సాంస్కృతిక వైవిధ్యతకు సామూహిక ప్రతిబింబం. సాహిత్య రూపంగానే కాక సామాజిక, ఆధ్యాత్మిక, రాజకీయ,చారిత్రక, పాలనాపరమైన, భక్తి తాదాత్మ్యతతో కూడిన ఒక సంపూర్ణ, సమగ్ర జీవన చిత్రం. భారతీయ జీవన విలువల విశిష్టతను ఒకేచోట అందిస్తున్న జ్ఞాన సంచయం ఉ మహాభారతం!

అందుకే మహాభారతం భారతీయ ప్రజా జీవన స్రవంతిలో అంతర్భాగంగా, భారతంలోని కథలు, పాత్రలన్నీ మన జీవితానికి ప్రతిరూపాలుగా చేతనంగా, అచేతనంగా, సుప్తచేతనంగా మనందరిలో శాశ్వతంగా నిలిచిపోయాయి. ప్రపంచ దేశాల్లో భారతీయ అస్తిత్వ పతాకంగా, సామూహిక మానసిక బంధంగా ఇతిహాసమై సాగుతున్నది. మహాభారతం వేదవ్యాసుని రచనగా సంస్కృతంలో మొదలైనప్పటికీ ఆ తర్వాత వేర్వేరు భాషల్లోకి అనువాదమై, భారతదేశంలోని వైవిధ్యత, విభిన్నత, విస్తృతికి అనుకూలంగా తనను తాను మార్చుకుంటూ గంగా నదిలా ప్రవహిస్తూ వస్తున్నది.

9వ శతాబ్దంలోనే మహాభారత గాథను 'విక్రమార్జున విజయం' అనే పేరుతో కన్నడ భాషలో ఒక తెలంగాణ కవి తొలిసారిగా అనువదించాడు. ఆయనే మహాకవి పంపన! వేములవాడ ప్రాంతం నుంచి ప్రస్థానాన్ని ప్రారంభించి రెండవ అరికేసరి చక్రవర్తి సమకాలికుడుగా కొనసాగి, 'తెలుగన్నడ బంధాని'కి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పంపన రాసిన 'పంప భారతం' 1,100 సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారిగా తెలుగులో ఇటీవలే అనువాదమైంది. ప్రముఖ కవయిత్రి, 'అక్షర్ యాన్' వ్యవస్థాపకురాలు అయినంపూడి శ్రీలక్ష్మి పూనికతో, డాక్టర్ జోస్యుల సదానంద శాస్త్రి అనువాద రచనలో, పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి ప్రచురణలో వచ్చిన ఈ 1,800 పేజీల బృహత్ అనువాద గ్రంథం, ఇప్పుడు తెలుగు సాహితీ లోకంలో చర్చను లేవనెత్తింది. తెలంగాణ సాహితీ చరిత్రకు కొత్త చేర్పును అందించింది. ఈ నేపథ్యంలో సంస్కృత మూల మహాభారత గాథ వివిధ భారతీయ, ప్రపంచ భాషలలో అనువాదమైన తీరుతెన్నులపై అవలోకనం చేయాల్సిన అవసరాన్ని సృష్టించింది.

**మహాభారత అనువాదాలు:**

వేద వ్యాసుడు రచించిన మహాభారతాన్ని వివిధ భాషల్లో పలువురు సాహితీవేత్తలు అనుసృజనను, అనువాదాలను చేశారు. వీటన్నింటి సమగ్ర విశ్లేషణను అనుసరించి, మహాభారత అనువాదాలు/అనుసృజనలను స్థూలంగా నాలుగు రకాలుగా నేను వర్గీకరించాను.

**మహాభారత యథాతథ అనువాదాలు**

మహాభారత ప్రధాన పాత్రల ఆధారిత కథనాలు

మహాభారతంలోని విస్తృత పాత్రల ఆధారిత కథనాలు

**మహాభారతంలోని ఉపాఖ్యానాల ఆధారిత రచనలు.**

ఇందులో కవిత్రయ విరచితమైన 'శ్రీమదాంధ్ర మహాభారతం' కొంతవరకు మహాభారత యథాతథ అనువాదం కోవలోకి వస్తే, పంపన కవి రాసిన 'విక్రమార్జున విజయం' మహాభారత ప్రధాన పాత్రల ఆ ధారిత అనువాదాల కోవలోకి వస్తుందని చెప్పవచ్చు.

భారతం ఒక మహావృక్షం:-

నన్నయ మహాభారతాన్ని అనువదిస్తూ దాని విస్తృతిని మహావృక్షంతో పోల్చాడు. మహాభారత గాథ స్ఫూర్తితో, ఉపాఖ్యానాల స్ఫూర్తితో ఎన్నో రచనలు ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషలలో వచ్చాయి. వాటిలో క్రీ.శ. రెండు, మూడు శతాబ్దాల నాటి కాలంలో సంస్కృత పండితుడు భాసుడు 'ఊరు భంగం' అనే పేరిట ఒక అత్యంత అద్భుతమైన కావ్యాన్ని రాశారు. మహాభారతంలో చిట్టచివరిదైన దుర్యోధనుడు-భీముడు మధ్య జరిగే సంగ్రామాన్ని కథాంశంగా తీసుకొని ఆయన ఈ సంస్కృత కావ్యాన్ని రాశారు. 'మధ్యమ వ్యాయోగం' అనే పేరిట మరొక కావ్యాన్ని భీమునికి-ఘటోత్కచుడి మధ్య జరిగే సంవాదం కథాంశంగా భాసుడు సంస్కృతంలో రాశాడు. సంస్కృత సాహిత్యానికి మహోన్నత స్థానాన్ని తీసుకొచ్చిన కాళిదాసు రాసిన మహా కావ్యాలలో 'అభిజ్ఞాన శాకుంతలం' కూడా ఒకటి. ఈ కావ్యం 4వ శతాబ్దంలో రాసినా దీనికి మూలం మహాభారతంలోని శకుంతలా ఉ దుష్యంతుల ప్రేమ కథ స్ఫూర్తిగా నిలవడం ఇక్కడ ప్రస్తావనార్హం. ఆయనే రాసిన 'విక్రమోర్వశీయం' కావ్యం! (మహారాజైన పురూరవునికి, దేవకన్య ఊర్వశికి మధ్య జరిగే ప్రేమ వృత్తాం తం) ఇది కూడా మహాభారత ఉపాఖ్యానం నుంచి తీసుకున్నదే! ఇక వ్యాసుడి శిష్యుడైన జైమిని మహర్షి కూడా 'జైమిని భారతం' పేరిట సంస్కృతంలో మహాభారతాన్ని రాశాడు. ఇందులో మొత్తం భారతాన్ని కాకుండా, అశ్వమేధ పర్వంలోని గాథనే ప్రధాన కథగా రాశారు. మహాభారత యుద్ధానంతరం ధర్మరాజు చేసిన 'అశ్వమేధయాగం' ఈ కావ్య ఇతివృత్తం.

**భారతీయ భాషల్లో భారత గాథ:-**

భారత గాథ ఇతర భారతీయ భాషల్లోకి రెండు రూపాలుగా వెళ్లిందని చెప్పవచ్చు. యథాతథ అనువాదం.

**మార్పులు చేర్పులతో తమదైన కథా రచన.**

ఇక ఆధారాలు లభించిన మేరకు మహాభారత గాథ వివిధభారతీయ భాషలలో తొలి రూపాలు ఇలా ఉన్నాయి:-మొదట 9వ శతాబ్దంలో తమిళంలోకి 'పెరుందేవనార్' రాసిన 'భారత వెణ్బ' పేరుతోనూ, కన్నడలో పంపన 'విక్రమార్జున విజయం' పేరుతోనూ, తెలుగులో కవిత్రయం




(నన్నయ్య 11వ శతాబ్దం నుంచి మొదలుకొని తిక్కన 13వ శతాబ్దం, ఎర్రన 14వ శతాబ్దం) రాసిన 'శ్రీమదాంధ్ర మహాభారతం' పేరుతోనూ, అనువాదాలు వచ్చాయి. 15వ శతాబ్దంలోనే ఒడియాలో 'సరళాదాస్', మలయాళంలో ఎళుతచ్చన్ రాసిన ('మహాభారతం కిళిప్పాట్టు') బెంగాలీలో కవీంద్ర పరమేశ్వర తొలిసారిగా అనువదాలు చేశారని తెలుస్తున్నది. బెంగాలీలో ఈ మహాభారతాన్నిమొదటిసారిగా 16వ శతాబ్దంలో అనువాదం చేశారు. హుబ్లీ ప్రాంతానికి చెందిన కవీంద్ర పరమేశ్వర్, సిల్హట్ ప్రాంతానికి చెందిన శ్రీసంజయ ఈ ఇద్దరిలో ఎవరు రాశారు అనేది స్పష్టంగా తెలియనప్పటికీ బెంగాలీలో రాసిన తొలి మహాభారతంగా ఇది తనదైన ముద్రను వేసింది. హిందీలో రామ్‌ధారి సింహ్ 'దినకర్' (1908-1974) 'రష్మీ రథి' పేరుతో 1952లో రాసిన నవలను ఇప్పటికీ గొప్ప నవలగా పేర్కొంటారు. మహాభారతంలోని కర్ణుడిని ప్రధానపాత్ర చేసుకుని ఈ నవలను ఆయన రాశారు. ఈయన రాసిన 'కురుక్షేత్ర' కవిత కూడా భారతంలోని శాంతి పర్వం నుంచి స్ఫూర్తి పొందిన రచనే!

(సశేషం)

**-డాక్టర్ మామిడి హరికృష్ణ**

# తెలిసి చేస్తున్న తప్పు తెచ్చిపెడుతోంది ముప్పు



**అనకాపల్లి, విశాఖసమాచారం:** అనకాపల్లి సమీపంలోని కళాశాల కూడలి వద్ద రెండు రోడ్ల మధ్యలో ఇనుప గ్రిల్స్ ఉండీ లేనట్టుగా తయారయ్యాయి. పిసినికాడ, కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం, నర్సింగబిల్లి, నక్కపల్లి, ఉద్దండపురం ప్రాంతాల్లో వీటిని పూర్తిగా తొలగించారు. ప్రమాదాలు ఎక్కువ ఇక్కడే జరుగుతున్నాయి.
గ్రిల్స్ రాత్రుళ్లు సైతం ఇవి స్పష్టంగా కనిపించేలా ప్రతి ఆరునెలలకు వీటికి పసుపు రంగు పెయింట్ వేయాలి. ఇది ఎక్కడా జరగడం లేదు. ఎలమంచిలి జాతీయ రహదారిపై వాహనాల వేగం గంటకు వంద కిలోమీటర్లపైనే ఉంటోంది. ఎవరైనా హఠాత్తుగా రోడ్డుమీదకొస్తే వాహనదారులు అప్రమత్తం అయ్యేలోగానే ప్రమాదం సంభవించే ఆస్కారం ఉంది. వాటిని నివారించే లక్ష్యంతో రహదారి మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కానీ క్రమేపీ ఇవి తగ్గిపోతూ వస్తు న్నాయి. కొన్నిచోట్లా నామ మాత్రంగానే మిగిలాయి.
జిల్లాలో జాతీయ రహదారి అడ్డురోడ్డు, ఎలమంచిలి మినహాయించి మిగతా అన్నిచోట్లా గ్రామాల మధ్యలో నుంచే వెళ్తోంది. ఈ గ్రామాల ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు.. రోడ్డు దాటేందుకు వీలుగా అధికారిక మార్గాలు, డివైడర్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పాడి పశువులు, మూగ జీవాలు సంచరించే ప్రాంతాల్లోనూ అవతల రోడ్డునుంచి ఇవతల రోడ్డులోకి హఠాత్తుగా వచ్చేయకుండా గ్రామాలు లేనిచోట్ల రోడ్డు మధ్య ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కానీ చుట్టూతిరిగి రావాల్సి వస్తోందనే ఉద్దేశంతో ఎవరికి నచ్చినచోట వారు వీటిని తొలగించి అనధికార ద్వారాలు తెరిచారు. ఇంకొన్నిచోట్ల మందుబాబులు తొలగించి పట్టుకుపోయారు. గ్రిల్స్ లేకపోవడంతో జనాలు అటు, ఇటు పరుగెత్తి రోడ్డు దాటుతున్నారు. ఆకస్మికంగా ఇలా రోడ్డు దాటుతున్న వారిని వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొట్టడంతో మృత్యువాత పడుతున్నారు. మనిషి దగ్గరపడ్డాక వాహనాన్ని కంట్రోల్ చేయలేక బ్రేక్ వేసి బోల్తాపడిన వాహనాలూ అనేకం ఉన్నాయి. జాతీయ రహదారి పొడవునా గ్రిల్స్ తొలగించిన చోట్లనే ఏటా 40 నుంచి 50 వరకూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 20 నుంచి 30 మంది వరకూ చనిపోతున్నారు. జాతీయ రహదారి నిర్వహణ బాధ్యతలు చేపట్టిన వారు ఇవన్నీ పరిశీలించి ఎప్పటికప్పుడు ప్రమాదాల నివారణకు వీటిని సరిచేయాలి. దీనిని నేషనల్ హైవే అథారిటీ అధికారులు పర్యవేక్షించాలి. ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను పోలీసు రవాణా శాఖ అధికారులు కలిసి ఉమ్మడిగా తనిఖీలు చేశారు. దారిపొడవునా తొలగించి ఉన్న గ్రిల్స్ చూసి విస్తుపోయారు. నిర్వహణ దారుణంగా ఉందని గుర్తించారు.
జాతీయ రహదారి పొడవు : 64 కిలోమీటర్లు


**ఈస్ట్‌కోస్ట్ రైల్వే**

ప్రకటన నం. eT-West-WAT-02-2026, తేది: 18.02.2026

**పని పేరు**

వాల్తేరు డివిజన్‌లోని KK-II లైన్ పై సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (పి.వే)/ బచేలి అధికార పరిధి క్రింద 15.26 TKM పొడవు కొరకు న్యూ వైడ్ బేస్డ్ PSC స్లీపర్స్‌తో త్రూ స్లీపర్ రెన్యువల్ (ప్రైమరీ)

**సుమారు పని వ్యయం:**

రూ. 5,17,65,744.81, బయానా: రూ. 4,08,800.00, పని పూర్తి చేయు కాలం: 12 (నెలలు) నెలలు

**టెండరు ముగింపు తేది & సమయం**

12.03.2026న 1500 గం.లకు.

సంస్థ లెటర్ హెడ్‌పై దాఖలు చేయబడినప్పటికీ, సకాలంలో అందినప్పటికీ కూడా సదరు టెండర్లపై తపాలా/కొరియర్/ఫ్యాక్స్ లేదా స్వయంగా ఎటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు చెల్లనివిగా పరిగణించబడును మరియు ఎటువంటి పరిశీలన లేకుండా తిరస్కరించబడును. పై ఇ-టెండరు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్‌సైట్ www.ireps.gov.in లో లభిస్తుంది.

గమనిక: కాగోరు టెండరుదారులు ఈ టెండరు కొరకు జారీ చేయబడినట్టి ఏవేని సవరణలు/మార్పులు గమనించుటకు టెండరు ముగింపు తేదీనకు ముందు 10 (పది) రోజులు వెబ్‌సైట్‌ను తిరిగి దర్శించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (Engg.)/ వాల్తేరు

PR-1158/Q/25-26


# 'భోగాపురం' అనుసంధానానికి ఆటంకాలెన్నో



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాఖపట్నం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేసరికి విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) నిర్మిస్తున్న ఏడు రహదారులు పూర్తవ్వాలి. జూన్ నాటికి గడువు విధించుకున్నారు. దీంతో భూసేకరణలో ఇబ్బందులుంటే... సేకరణ అయినంత వరకు పనులు త్వరత్వరగా చేసేస్తున్నారు.
**తిమ్మాపురం-మారికవలస:** మొత్తం ఏడు మార్గాల్లో.. 6.30 కి.మీ.మేర, 30 మీటర్ల వెడల్పున ఈ రోడ్డు మాత్రమే పూర్తయింది.
**అడివివరం-శొంఠ్యాం:** 85 శాతం భూసేకరణ పూర్తయింది. అటవీశాఖ భూముల విషయంలో అనుమతులు రావాల్సి ఉంది. ఫిబ్రవరి నెలాఖరుకు ఈ సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నారు. దీంతో ముక్కలుముక్కలుగా రోడ్డు నిర్మించాల్సి వస్తోంది. చిక్కులు లేని చోట తారు రోడ్డు పనులూ పూర్తి చేయడం గమనార్హం..
**తాళ్లవలస-నేరెళ్లవలస:** 87 శాతం భూసేకరణ పూర్తయింది. మిగిలినది నెలాఖరుకు కొలిక్కి రానుంది. నేరెళ్లవలస నుంచి చాలా వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సి వస్తోంది. కొన్ని చోట్ల కొండను తవ్వి పనులు చేస్తున్నారు.
**బోయ పాలెం- కాపులుప్పాడ:** 30 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. భూసేకరణ 94 శాతం పూర్తయింది. పనులు కొంత జోరుగా జరుగుతున్నాయి. ఇంకా సగం నిర్మించాల్సి ఉంది.
**వేపగుంట-పినగాడి:** 18 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ నిర్మిస్తున్న 3.20 కి.మీ. మేర భూసేకరణ 70 శాతం పూర్తవ్వగా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. జీవీఎంసీ చేపట్టాల్సిన 3.92 కి.మీ. భాగం అసలు ముందుకు కదలడం లేదు. భూసేకరణతో పాటు పనులు ప్రారంభించలేదు.
వేపగుంట-జుత్తాడ: 70 శాతం భూసేకరణ జరిగింది. పనులు నత్తనడకన జరుగుతున్నాయి. జీవీఎంసీ ఆధ్వర్యంలో కొద్ది రోజుల కిందటే పనులు ప్రారంభించారు.
**భీమిలి-దొరతోట:** ప్రభుత్వం నుంచి ఆర్థిక అనుమతులు రావాల్సి ఉంది. ఈ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారనేది తేలలేదు.
**మే నాటికి:** 'వీఎంఆర్‌డీఏ చేపట్టిన రోడ్లను ఎట్టిపరిస్థితుల్లో మే నాటికి పూర్తిచేస్తాం. ఇప్పటికే పనులు అన్ని చోట్ల యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. పూర్తయిన రోడ్లకు ఒకే రోజు

| రోడ్డు | పొడవు (కి.మీ.) | పనులప్రగతి (శాతం) |
|---|---|---|
| అడివివరం-శొంఠ్యాం | 8 | 35 |
| తాళ్లవలస-నేరెళ్లవలస | 3.83 | 39 |
| బోయపాలెం-కాపులుప్పాడ | 3.10 | 58 |
| వేపగుంట-పినగాడి | 8.10 | 15 |
| వేపగుంట-జుత్తాడ | 6.05 | 5 |
| భీమిలి-దొరతోట | 6.02 | 0 |
| తిమ్మాపురం-మారికవలస | 6.3 | 100 |


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన నం. eT-BR-WAT-04-2026 తేది.17.02.2026

**పని పేరు:**

అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్/బ్రిడ్జ్‌స్/ వాల్తేరు అధికార పరిధి క్రింద సీనియర్ సెక్షన్ ఇంజనీర్/ బ్రిడ్జ్‌స్/ అరకు & జగ్దల్‌పూర్ సెక్షన్ యొక్క కొత్త వలస- కిరండల్ సెక్షన్ మధ్యన ఇన్నర్ ఇన్‌స్పెక్షన్ ప్లాట్‌ఫామ్ అరెంజ్‌మెంట్ మరియు బ్రిడ్జీలను బలోపేతం చేయుట.

**పని సుమారు వ్యయం**

రూ.3,09,70,564.16 బయానా: రూ.3,04,900.00 పనిపూర్తి చేయుకాలం :12 (పన్నెండు) నెలలు.

**టెండరు ముగింపు తేది మరియు సమయం:**

13.03.2026న 15.00గం.లకు

సంస్థ లెటర్ హెడ్‌పై దాఖలు చేయబడినప్పటికీ, సకాలంలో అందినప్పటికీ కూడా సదరు టెండర్లపై తపాలా/కొరియర్/ఫ్యాక్స్ లేదా స్వయంగా ఎటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు చెల్లనివిగా పరిగణించబడును మరియు ఎటువంటి పరిశీలన లేకుండా తిరస్కరించబడును. పై ఇ-టెండరు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లో లభిస్తుంది.

గమనిక: కాగోరు టెండరుదారులు ఈ టెండరు కొరకు జారీ చేయబడినట్టి ఏవేని సవరణలు/మార్పులు గమనించుటకు టెండరు ముగింపు తేదీనకు ముందు 10 (పది) రోజులు వెబ్‌సైట్‌ను తిరిగి దర్శించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (Engg.)/ వాల్తేరు

PR-1161/Q/25-26


# 'కల్తీ' నెయ్యి తో మాయగాళ్ల ఇష్టారాజ్యం



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన వణికిస్తోంది. ప్రాణాలు తీసేంత స్థాయిలో జరిగిన కల్తీ ఉదంతం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో మహానగరం విశాఖలో పరిస్థితి ఎలా ఉంది? అని ఎంతో మందిలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల అధికారులు 40 చోట్ల తనిఖీలు చేసి ప్రమాణాలు పాటించని కొందరు విక్రేతలపై కేసులు నమోదు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇళ్లు అద్దెకు తీసుకొని మోసపూరిత విధానాలతో కల్తీలకు పాల్పడి పాల ఉత్పత్తులు కృత్రిమంగా తయారు చేసే ముఠాలు నగరంలో ఉన్నట్లు గుర్తించారు. రసాయనాలు కలిపి: పూర్ణ మార్కెట్ ప్రాంతంలో కల్తీ నెయ్యి తయారు చేస్తూ ఇటీవల కొందరు చిక్కారు. కొన్ని డబ్బాల్లో పాల పౌడర్‌ను వేసి వాటిల్లో పామాయిల్ నిల్వ చేస్తున్నారు. వీటికి ప్రమాదకర రసాయనాలు కలిపి ముద్దగా వచ్చిన పదార్థాన్ని వేడి చేసి డబ్బాల్లో వేసి సీలు ప్యాకింగ్‌తో నెయ్యి పేరుతో విక్రయానికి ఉంచారు. కర్ణాటక నుంచి వచ్చిన కొందరు ఇలా కల్తీకి పాల్పడు తున్నట్లు ఆహార భద్రతాధికారులు తనిఖీల్లో గుర్తించారు. భారీగా పామాయిల్ ప్యాకెట్లు, నిల్వ చేసిన ఇతర రసాయనాలు బయటపడ్డాయి. నమూనాలు ప్రయోగశాలకు పంపగా తయారు చేసిన పదార్థాలు సురక్షితం కాదని తేలింది. వారిపై కేసు నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సదరు వ్యక్తులకు తాఖీదులు పంపారు. అప్రమత్తంగా ఉండాలి: గృహాలకు వచ్చే పాలను కల్తీ చేసే ప్రమాదం లేకపోలేదని ఆహార భద్రతాధికారులు హెచ్చరిస్తున్నారు. పాల పౌడర్లలో యూరియా, మరికొన్ని పదార్థాలు కలిపి స్వచ్ఛమైన పాలులా కనిపించేలా, అనుమానం రాకుండా ఉండేందుకు వాటికి నురుగు వచ్చేలా చేస్తారు. నగరంలో పాల కల్తీ కేసులు ఇటీవల నమోదవ్వనప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రైతుల నుంచి కొందరు మధ్యవర్తులు కొనుగోలు చేసి ఇంటింటికీ సరఫరా చేసే సందర్భాలు, నిల్వ కేంద్రాల్లో ఈ రకమైన మోసాలకు పాల్పడే అవకాశం ఉందంటున్నారు. నగరంలో 85 శాతం మంది ప్యాకెట్ పాలే వినియోగిస్తున్నట్లు సమాచారం. మూడు జిల్లాల్లో తనిఖీలు: 'తూర్పు గోదావరి జిల్లాలో చోటు చేసుకున్న కల్తీ పాల వ్యవహారంతో అప్రమత్తమయ్యాం. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖ జిల్లాల్లోని పాల సేకరణ కేంద్రాలు, నిల్వ పాయింట్ల నుంచి నమూనాలు సేకరించాలని తనిఖీ అధికారులను ఆదేశించాం. శుభ్రత, శాస్త్రీయ పద్ధతులు పాటిస్తున్నారా లేదా అనేది తనిఖీ చేస్తాం' అని ఆహార భద్రత సహాయ తనిఖీ అధికారి కల్యాణచక్రవర్తి పేర్కొన్నారు

# పైన కూరగాయలు..లోపల గంజాయి




రలు తయారు చేయించారు. అందులో గంజాయి ప్యాకెట్లను ఉంచి ఎవరికీ అనుమానం రాకుండా పైన కూరగాయల లోడుతో ఒడిశా నుంచి అల్లూరి జిల్లా మీదుగా వస్తూ సోమవారం పోలీసులకు పట్టుబడ్డారు. 80 ప్యాకెట్లలో 160 కేజీల గంజాయితోపాటు రెండు బొలెరోలు, ఒక కారు, మోటారు సైకిల్, తొమ్మిది సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.19 కోట్లు ఉంటుందని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.
తూర్పుగోదావరి జిల్లా మండపేటలోని సైదులుపేటకు చెందిన గుల్లిపల్లి హరిబాబు (36) ప్రధాన నిందితుడు. కంప్యూటర్స్ సైన్స్ చదివాడు. 2018లో 80 కేజీల గంజాయితో పట్టుబడి జైలుకు వెళ్లాడు. అక్కడ గంజాయి నిందితులతో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు. కారాగారం నుంచి బయటకు వచ్చాక ఇద్దరు నిందితుల పేరుతో రెండు బొలెరో వాహనాలను కొనుగోలు చేశాడు. వాటికి రహస్య అరలు తయారు చేయించాడు. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని రహస్య అరల్లో దాచి పైన కూరగాయలు లోడుతో ఇప్పటివరకు 12 పర్యాయాలు రవాణా చేశాడు. తాజాగా తమిళనాడులోని దిండిగల్‌కు గంజాయి తరలించే క్రమంలో ముఠా పోలీసులకు దొరికిపోయింది.
పట్టుబడిన వారిలో మండపేటలోని రాజారత్నం వీధికి చెందిన వీరవల్లి దుర్గారావు, అల్లూరి జిల్లా పెదబయలు మండలం వన్నాడ గ్రామానికి చెందిన కొర్రా బొంజిబాబు, బయరాజులు గ్రామానికి చెందిన బొండా ప్రభాకర్, జి.మాడుగుల మండలం కరకపల్లికి చెందిన వంతల దావీదు ఉన్నారు. మండపేటకు చెందిన మాచవరపు ప్రసాదు, జి.మాడుగుల మండలం కరకపల్లికి చెందిన వంతల ఎలియా పారిపోయారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులు ఒడిశాలోని కోటిపల్లి, జాన్‌బాయ్, మల్కాన్‌గిరి, అల్లూరి జిల్లా పెదబయలు, జి.మాడుగుల, చెరుకుంపాకలు, చింతపల్లి, రంపుల ఘాటీ, రింతాడ, రత్నంపేట, ఆడాకుల మీదుగా వస్తూ అనకాపల్లి జిల్లా నాతవరం మండలం వెదురుపల్లి వద్ద పోలీసులకు దొరికిపోయారు. నిందితుల్లో ఒకరు పారిపోతుండటంతో హెడ్ కానిస్టేబుల్ మూడు కిలోమీటర్లు వెంబడించి పట్టుకున్నారు. గంజాయితో నిందితులను అరెస్టు చేసిన సీఐ రేవతమ్మ, ఎస్సైలు తారకేశ్వరరావు (నాతవరం), రుషికేశ్వరరావు (కృష్ణదేవిపేట), రాజారావు (నర్సీపట్నం గ్రామీణం)ను డీఎస్పీ అభినందించారు

# ప్రాణాలు పోతున్నా మారని తీరు..

**ద్విచక్ర వాహన ప్రమాదాలు**

| సంవత్సరం | ప్రమాదాలు | మృతులు | క్షతగాత్రులు |
|---|---|---|---|
| 2023 | 350 | 95 | 215 |
| 2024 | 295 | 130 | 265 |
| 2025 | 252 | 141 | 250 |

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాఖపట్నం నగర రహదారులపై ఎక్కడో ఒకచోట నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మత్తు, అతివేగం వల్ల నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ద్విచక్ర వాహన చోదకులే ఎక్కువగా ప్రమాదాలబారిన పడుతున్నారు. అతివేగానికి, మద్యం మత్తుకు కళ్లెం వేసే తనిఖీలు ఇంకా సమర్థంగా నిర్వహించాల్సి ఉంది.
**చీకట్లో గుర్తించక:** పారిశ్రామిక ప్రాంతాలు, ఎన్ఏడీ కూడలి, తెలుగు తల్లి పైవంతెన, బీచ్ రోడ్డు, బీఆర్‌టీఎస్ మార్గాల్లో రాత్రి వేళల్లో పలువురు ద్విచక్ర వాహన చోదకులు అతివేగంగా నడుపుతున్నారు. బీచ్ రోడ్డులో నిర్మానుష్య ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగి గమ్యానికి చేరుకునే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.
**సిబ్బంది చేతివాటం?:** బ్రీత్ అనలైజర్స్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసే కొందరు సిబ్బందే మద్యం మత్తులో ఉంటున్నారనే ఆరోపణలూ వస్తున్నాయి. మరికొందరు మద్యం తాగిన వారిని గుర్తించినా వదిలేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. కొందరిపై ఇలా ఆరోపణలు రాగా... వాస్తవం తేలిన తరువాత కొందరిపై సీపీ చర్యలు తీసుకున్న ఉదంతాలు న్నాయి. బీచ్ రోడ్డులో నిర్మానుష్య ప్రదేశాల్లో మద్యం తాగిన వారిని పట్టుకున్నా కొందరు సమీప దుకాణాల నెంబర్లకు మందుబాబులతో ఫోన్‌పే చేయించి వదిలేస్తున్నారు. గతేడాది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.10.49 కోట్ల జరిమానా విధించారు




# అంతదూరం వెళ్లేసరికి అంతా బుగ్గి



**నర్సీపట్నం, విశాఖసమాచారం:** ఎండా కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. ప్రజల నిర్లక్ష్యం, ఏమరపాటు ఇందుకు కారణమవుతుంది. ఈ ఏడాది మహాశివరాత్రి మరుసటి రోజు నుంచే భానుడు చుర్రుమంటున్నాడు. వేసవి ఆరంభంలోనే అగ్నిప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.
నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం పరిధి చాలా ఎక్కువ. ఈ కేంద్రం నుంచి చివరి గ్రామాలు, మండల కేంద్రాలు 70 నుంచి 130 కిలోమీటర్ల దూరాన ఉన్నాయి. రోలుగుంట, కోటవురట్ల, నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ, అల్లూరి జిల్లాలోని గూడెంకొత్తవీధి, చింతపల్లి, కొయ్యూరు మండలాలు ఈ కేంద్రం పరిధిలోనే ఉన్నాయి. ఒకే సమయంలో రెండుచోట్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలమంచిలి, తుని, రావికమతం, అనకాపల్లిలోని కేంద్రాల నుంచి శకటాలను రప్పించాల్సి వస్తోంది. 28 కి.మీ. దూరానికి 50 కి.మీ. దూరంలో ఉన్న పొరుగు కేంద్రాల నుంచి శకటం వచ్చే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.
నర్సీపట్నం కేంద్రం పరిధిలో గడిచిన ఐదేళ్లలో 553 అగ్నిప్రమాదాలు జరిగి రూ.9.84 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఇప్పటివరకు 18 చోట్ల ప్రమాదాలు సంభవించాయి. రూ.12.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను ఆర్పడం ద్వారా రూ.51 లక్షల విలువైన ఆస్తిని కాపాడారు. తగిన వసతి, భవనం, అవసరమైన భూమి అందుబాటులో ఉన్నందున నర్సీపట్నంలో రెండో అగ్నిమాపక యూనిట్ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.
ప్రమాదాల్లో నష్టపోయేది ఎక్కువగా రైతులే కావడం గమనార్హం. మద్యం సేవించేందుకు ఊరవతల తోటల్లోకి వెళ్లే వారు సిగరెట్ తాగి ఆర్పకుండా పడేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చాలా గ్రామాల్లో రోడ్డు పక్కనే చెత్తకుప్పలు ఉంటాయి. వీటికి పారిశుద్ధ్య సిబ్బంది నిప్పుపెట్టి వెళ్తుంటారు. మంటలు ఎగిసి సమీపంలోని తోటలకు అంటుకుంటున్నాయి. నెల్లిమెట్ట సమీపంలో ఇటీవల చెత్త నుంచి మంటలు ఎగసిపడుతుండటం గమనించిన పోలీసులు వెంటనే ఆర్పివేశారు.
రోలుగుంట మండలం కొంతలంలో ఈ నెల 12న నీలగిరి, టేకు, సరుగుడు తోటలు దగ్ధమై రూ. 1.2 లక్షల నష్టం వాటిల్లింది. అదే రోజు నాతవరం మండలం దద్దుగులలో పది ఎకరాల్లో సరుగుడు తోట, రెండు పూరిళ్లు కాలిపోయి రూ. 5 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈనెల 8న నీలంపేట సమీపంలోని సాధూపాకల వద్ద పది ఎకరాల్లోని నీలగిరి తోటకు మంటలు అంటుకుని రూ. 2 లక్షల నష్టం వాటిల్లింది. తోటలతోపాటు గడ్డివాములు, వరికుప్పలు ఎక్కువగా కాలిపోయాయి.
**నిర్లక్ష్యం ఇసుమంతైనా వద్దు...** చుట్ట, బీడీ, సిగరెట్ కాల్చి ఆర్పకుండా పడేయడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ నెలలో ఇప్పటివరకు జరిగిన ఘటనలను విశ్లేషిస్తే తెలుస్తోంది. పొగతాగే వారి నిర్లక్ష్యం పెను నష్టానికి దారితీస్తోంది. తోటలు ఉన్న రైతులు ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసుకుంటే ప్రమాద తీవ్రత తగ్గించుకోవచ్చు. నర్సీపట్నంలో రెండో యూనిట్ అగ్నిమాపక వాహనం అవసరాన్ని జిల్లా అధికారులు సభాపతి అయ్యన్నపాత్రుడి దృష్టికి తీసుకువెళ్లారు

# మార్కెట్ కమిటీరైతులకు ఒరిగిందేమిటి



జిల్లాలోని మార్కెటకమిటీలు రైతుల ప్రయోజనాలను గాలికొదిలేశాయి. కేవలం సెస్ వసూలుకే కమిటీలు పరిమితం అవుతున్నాయి. జిల్లాలోని ఆరు మార్కెట్ కమిటీలకు 2025-26 సీజన్‌లో రూ. 9.67 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా.. ఇంతవరకు రూ. 6.29 కోట్లు వచ్చింది. పాయకరావుపేట దాదాపు 90 శాతం వసూలు చేయగా, ఎలమంచిలి, మాడుగుల మార్కెట్ కమిటీలు 53 శాతం వసూలు చేశాయి. వచ్చే నెలాఖరు లోపు లక్ష్యం ఏవిధంగా చేరుకోవాలని ఆలోచిస్తున్నారే కాని రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించడం లేదు. ఈ సీజన్‌లో ఇంతవరకు ఒక్క రూపాయి అన్నదాతల కోసం ఖర్చు చేసింది లేదు. విశాలమైన యార్డు ఉన్నా. అనకాపల్లి మార్కెట్ యార్డుకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఇక్కడ బెల్లం అమ్మకాలు జోరుగా సాగుతాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు యార్డుకు వస్తారు. ఇక్కడ వందలాది మంది కార్మికులు పని చేస్తుంటారు. వీరికి కనీసం స్వచ్ఛమైన తాగునీరు లేదు. యార్డులో రెండు మూత్రశాలలు ఏర్పాటు చేశారు. ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో తుప్పలు పెరిగిపోయాయి. యార్డులో కనీసం క్యాంటీన్ సౌకర్యం లేదు. గతంలో ఒకటి ఉండేది. తర్వాత దాన్ని మూసివేశారు. రైతులు విశ్రాంతి తీసుకునేందుకు భవనం నిర్మించారు. తర్వాత దీన్ని వ్యవసాయశాఖ కార్యాలయానికి కేటాయించారు. మురుగు కాలువలు లేకపోవడంతో చిన్న వర్షంపడినా నీరు నిలిచి పోతోంది.
రైతు బంధు లేదు...జిల్లాలో నర్సీపట్నం యార్డులో గతంలో రైతు బంధు పథకాన్ని అమలు చేసేవారు. దీనివల్ల మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉన్న సమయంలో గోదాముల్లో సరకు నిల్వ చేసుకునేవారు. రైతులకు సరకు విలువలో 75 శాతం రుణంగా తక్కువ వడ్డీకి అందించేవారు. మార్కెట్‌లో ధరలు బాగున్నప్పుడు అమ్మకాలు చేసుకునేవారు. ఈ ఏడాది పథకం అమలుకు రూ. 20 లక్షలు కేటాయించినా ఒక్క రూపాయి ఇవ్వలేదు. మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నా పనిచేయడం లేదు. సిమెంటు రహదారులు ఏర్పాటు చేయాల్సి ఉంది. యార్డులో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో రైతులు పంట ఉత్పత్తులు తీసుకురావడం లేదు.
పాయకరావుపేట మండలం పి.ఎల్.పురంలో యార్డు ఉంది. వారంలో ఒక రోజే పనిచేస్తుంది. ప్రతి ఆదివారం ఇక్కడ పశువుల సంత నిర్వహిస్తారు. మిగిలిన రోజులు మూతపడే ఉంటుంది. ఈ ప్రాంతంలో మామిడి, అరటి సాగు ఎక్కువ. ఇథనాల్‌తో పండ్లు మగ్గించే ఛాంబర్ ఏర్పాటు చేశారు. ఇది మూలకుచేరి నాలుగేళ్లు కావస్తున్నా పట్టించుకోలేదు.
చోడవరంలో 11 ఎకరాల్లో విశాలమైన యార్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎటువంటి క్రయవిక్రయాలు జరగడం లేదు. కమిటీ కేవలం సమావేశాలకే పరిమితమవుతుంది.

# రాజమహేంద్రవరంలో కొనసాగుతున్న కల్తీ పాల కలకలం



చికిత్స పొందుతున్న జి.వెంకటలక్ష్మి, ఆర్.సూర్యకుమారి, జి.సూర్యారావు, కె.సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు

**రాజమహేంద్రవరం:** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాల దుర్ఘటన మరణ మృదంగం మోగిస్తోంది. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, వెంకటేశ్వర నగర్‌లలో చోటుచేసుకుంటున్న మరణాలు కలకలం రేపుతున్నాయి. కల్తీ పాలు తాగి చౌడేశ్వరి నగర్‌కు చెందిన తాడి కృష్ణవేణి (85), కనకరత్నం (70) ఇప్పటికే మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఎన్.శేషగిరిరావు (72), రాధాకృష్ణమూర్తి (74), తాడి రమణి (58) మరణించారు. ఇప్పటివరకూ ఐదుగురు మృతి చెందగా.. అధికారులు మాత్రం నలుగురు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతదేహాలకు హడావుడిగా పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికలు రావాల్సి ఉంది. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లకు పైబడిన వృద్ధులు, మూడేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల్లో ఇద్దరు చిన్నారులు సహా 8 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

**17 మంది బాధితులు**

ఒక్కసారిగా మూత్రం ఆగిపోవడం (అనూరియా), వాంతులు, విరేచనాలు కావడం, కిడ్నీ ఫెయిల్ కావడం వంటి లక్షణాలతో బాధపడుతున్న వారు అధికారిక లెక్కల ప్రకారం 17 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఐదుగురు మృతి చెందగా.. మరో 12 మంది కిమ్స్, రెయిన్‌బో, రవి చైతన్య, సన్‌స్టార్ తదితర ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కిమ్స్‌లో ఏడుగురు చికిత్స పొందుతుండగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. రెయిన్‌బోలో ముగ్గురు చిన్నారులు చికిత్స పొందుతుండగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిలో ఐదు నెలల చిన్నారికి డయాలసిస్ చేస్తున్నారు. పరిస్థితి హృదయ విదారకంగా మారింది. అభం శుభం తెలియని పసివాడికి చికిత్స అందిస్తున్న దృశ్యం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఆదిత్య ఆస్పత్రిలో ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉంది. రవి చైతన్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. మరికొందరు జయ కిడ్నీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి చూస్తే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారి కుటుంబ సభ్యుల వేదనకు అంతే లేకుండా ఉంది. బాధితుల్లో ఎక్కువ మంది మధుమేహంతో బాధపడుతున్నారు. కాగా.. వైఎస్సార్‌సీపీ నేతలు చెబుతున్నదాని ప్రకారం కల్తీ పాల బాధితులు 19 మంది ఉన్నారు. వీరిలో ఐదుగురు మంది మృతి చెందగా.. మరో 14 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అధికారులు మాత్రం మొత్తం బాధితులు 17 మందేనని స్పష్టం చేశారు. వీరిలో నలుగురు మృతి చెందారని చెబుతున్నారు.

**కల్తీ నిర్ధారణకు మరో రెండు రోజులు**

పాలల్లో కల్తీని నిర్ధారించేందుకు మరో రెండు రోజుల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. పాల వ్యాపారి గణేష్ నుంచి పాలు పోయించుకుంటున్న 73 కుటుంబాల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించారు. ఈ నివేదికలు ఇంకా రావాల్సి ఉంది. వీటితో పాటు పశు సంవర్ధక శాఖ ద్వారా 46 పశువులకు పరీక్షలు నిర్వహించి ఆ నమూనాలను వైజ్ఞానిక, పశు సంవర్ధక శాఖ ప్రయోగశాలలకు పంపించారు. ఆహార భద్రత అధికారులు సేకరించిన పాలు, పెరుగు, పాల ఉత్పత్తులను హైదరాబాద్, విశాఖపట్నంలోని ప్రయోగశాలలకు పంపినట్లు కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు సైతం పంపించామన్నారు.

**వెలుగులోకి కీలక విషయాలు**

కల్తీ పాల కలవరానికి కారణమని భావిస్తున్న పాల వ్యాపారి గణేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణలో కీలక అంశాలు బహిర్గతమైనట్లు తెలిసింది. చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, వెంకటేశ్వర నగర్‌లలోని 106 కుటుంబాలకు కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి చెందిన అడ్డాల గణేష్ అనే వ్యాపారి ప్రతిరోజూ పాలు పోస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ శివరాత్రి కావడంతో పాలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీంతో రోజూ పాలుపోసే వారితో కలిపి మొత్తం 126 కుటుంబాలకు గణేష్ ఆ రోజు పాలు పోసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని సమాచారం. 16వ తేదీన పోసిన పాలు కొంచెం చేదుగా ఉన్నాయని వినియోగదారులు గణేష్ దృష్టికి తీసుకెళ్లగా.. మరునాటి నుంచి అలా జరగదని అతడు చెప్పడంతో మిన్నకుండిపోయారు. తిరిగి సాధారణంగా ఎప్పుడూ ఉండే రుచే ఉండటంతో వినియోగదారులు పట్టించుకోలేదు. ఆ రోజు గణేష్ నరసాపురం గ్రామ పరిసరాల్లో పాలను సేకరించినట్లు సమాచారం. దీనిని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. పాలు ఎక్కడెక్కడ, ఎవరెవరి నుంచి సేకరించాడనే విషయమై ఆరా తీస్తున్నారు. అనధికార డెయిరీ సీజ్ పాల వ్యాపారి గణేష్ నరసాపురంలో అనధికారికంగా నిర్వహిస్తున్న వరలక్ష్మి డెయిరీని పోలీసులు సీజ్ చేశారు. పాలు సేకరించే పరికరాలను స్వాదీనం చేసుకున్నారు. వెనిగర్, పాలు, కెమికల్స్ స్వాదీనం చేసుకున్నారు. పాలు, నీళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. పశువుల రక్త నమూనాలు సైతం సేకరించారు. కారణాలు బయటకొచ్చిన వెంటనే గణేష్‌తో పాటు ఇతర బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

**కాలనీల్లో వైద్య బృందాలు**

చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లలో వైద్య బృందాలు పర్యటిస్తున్నాయి. పాలు వినియోగించిన వారి రక్త నమూనాలు తీసుకుంటున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అధికారులు 18 బృందాలుగా విడిపోయి వైద్య పరీక్షలు చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన వారిలో వికారంతో కూడిన వాంతులు, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలు కనిపించాయని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడిన వారేనని చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామన్నారు. మా ఇంట్లో ముగ్గురి పరిస్థితి విషమం

మా ఇంట్లో నా తల్లి, తండ్రితో పాటు నా కుటుంబ సభ్యులు నలుగురికి కిడ్నీ విఫలమైంది. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. శివరాత్రి నాడు మా పాల వ్యాపారి అందించిన పాలు తీసుకున్న తర్వాత ఈ అనర్థం జరిగింది. ఆ పాలు తాగిన తర్వాత వాంతులు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపించాయి. వారం తర్వాత అంటే.. ఈ నెల 22న అందరికీ మూత్రం ఆగిపోయింది. కుటుంబంలో అందరికీ ఒకే సమస్య రావడంతో ఆందోళనకు గురై కిమ్స్ ఆస్పత్రిలో చేరగా చికిత్స అందిస్తున్నారు.

**-మధు, చౌడేశ్వరినగర్, రాజమహేంద్రవరం**

**శరీరమంతా దద్దుర్లు వచ్చేశాయి**

మా మనవరాలు నాలుగు రోజుల క్రితం పాలు తాగిన వెంటనే శరీరంపై దద్దుర్లు వచ్చాయి. ఆ పాల వ్యాపారికి మేం ఈ విషయం చెప్పాం. పాలు చేదుగా ఉన్నాయని తెలిపాం. కొత్తగా గేదె ఈనిందని, అందుకే పాల రుచిలో తేడా వచ్చిందన్నాడు. ఆ తర్వాత మా చుట్టుపక్కల అతను పాలు పోసిన ఇళ్లలో కిడ్నీ బాధితులు బయటపడుతుండటంతో ఆందోళనకు గురవుతున్నాం. మా మనవరాలిని ఆస్పత్రిలో చేర్చి వైద్యుల పర్యవేక్షణలో ఉంచాం. వారు చేసిన వైద్య పరీక్షల ఫలితాలు రావాల్సి ఉంది.

**ఉ షేక్ సిరాజుద్దీన్, చౌడేశ్వరినగర్, రాజమహేంద్రవరం**

**మిగతా వారిలోనూ సమస్యలు రావొచ్చు**

ఈ నెల 14న రాత్రి మూత్ర సమస్యతో నా వద్దకు కొందరు వచ్చారు. అందరూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో మంచినీటి సరఫరాపై అనుమానం కలిగింది. మంచినీటి సరఫరా బాగానే ఉందని మున్సిపల్ అధికారులు స్పష్టంచేయడంతో రోగులు తీసుకున్న ఆహారంపై ఆరా తీయగా పాలు తాగిన తర్వాత ఈ సమస్య వచ్చినట్లు తెలిసింది. ముందుగా బలహీనంగా ఉండే వృద్ధులు, చిన్నారులపై కల్తీ పాలు ప్రభావం చూపించాయి. మిగతా వారిలో కూడా భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు కలగవచ్చు. అందుకే ఆ పాలు తాగిన వారందరూ కిడ్నీకి సంబంధించి క్రియాటినిన్ పరీక్షలు చేయించుకోవాలి.

**- డాక్టర్ శశాంక్, కిడ్నీ వ్యాధుల నిపుణుడు, రాజమహేంద్రవరం**

బాధితులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మారింది. మూత్ర విసర్జన స్తంభించడం, కిడ్నీ సమస్యలు, వాంతులు, విరేచనాలతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు మూడేళ్ల చిన్నారిని తీసుకెళ్లగా.. అక్కడి వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడకు తీసుకెళ్లగా తమవద్ద వైద్య సదుపాయాలు లేవని వైద్యులు చెప్పడంతో ఆ చిన్నారి తల్లిదండ్రులు లబోదిబోమంటూ తిరిగి రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అదే విధంగా మరో చిన్నారి రితిక్ చికిత్స కోసం ఇప్పటివరకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.8.50 లక్షలకు పైగా ఖర్చయింది. మిగిలిన బాధితులకు సైతం వైద్య ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

# భయాందోళన చెందవద్దు



**రాజమహేంద్రవరం::** అక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై ప్రజలు భయాందోళన చెందవద్దని కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహకిషోర్ కోరారు. రాజమహేంద్రవరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితుల ఆరోగ్య పరిస్థితిని సోమవారం ఉదయం తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చౌడేశ్వరినగర్, స్వరూప్‌నగర్ ప్రాంతాల్లో నమోదైన కిడ్నీ సంబంధిత కేసులపై జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైందన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో విచారణ చేపట్టామన్నారు.

**ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు..**



నా సోదరుడు శేషగిరిరావు ఆరోగ్యంగా ఉండేవారు. మధుమేహం మినహా ఎలాంటి వ్యాధులు లేవు. అప్పటికప్పుడే మూత్రం నిలిచిపోవడంతో 17న రాత్రి ఆసుపత్రిలో చేర్చాం. వెంటిలేటర్ పెట్టారు. గణేష్ వద్దే పాలు పోయించుకుంటున్నాం. ఆదివారం నుంచి కోమాలోనే ఉన్న శేషగిరి సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ప్రభుత్వం ఇలాంటి కల్తీని అరికట్టాలి.

**వాణి, మృతుడు శేషగిరిరావు సోదరి, లాలాచెరువు**

**మాట్లాడే స్థితిలో లేడు..**



మా బాబు జైకృత్‌రాజ్ ఇన్నిరోజులైనా కనీసం మాట్లాడే స్థితిలో కూడా లేడు. 16న పాలు తాగిన తరువాత జ్వరం వచ్చింది. కిడ్నీ సమస్యని తేలింది. ఎంతో ఉరకలేస్తూ ఆడుకునే పిల్లాడిని ఇలా చూస్తుంటే తట్టుకోలేకపోతున్నాం. ఇలా పాలు కల్తీ చేసుకుంటూపోతే ఎవరు బాధ్యత వహిస్తారు..? ఇప్పటికే బాబుకు మూడుసార్లు డయాలసిస్ చేశారు. మళ్లీ చేయాలంటున్నారు.

**-మాదుర్గ, జైకృత్‌రాజ్ సమీప బంధువు**

**48 గంటలు వేచి చూడాలన్నారు...**



మా చిన్నారి కిడ్నీ సంబంధిత సమస్యతో వెంటిలేటర్‌పై ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తొలుత వాంతి అయి, ఆ తర్వాత మూత్ర విసర్జన సైతం నిలిచిపోయింది. ప్రస్తుతం ఆసుపత్రిలో డయాలసిస్ చేస్తున్నారు. మరో రెండ్రోజులు గడిస్తే తప్ప ఏమీ చెప్పలేమన్నారు. మేము గణేష్ వద్ద నెలన్నరగా పాలు కొనుగోలు చేస్తున్నాం.

**తేజ, అయిదు నెలల శిశువు రూహన్య చిన్నాన్న**

# పూర్తి కావాల్సిన 'ఉపాధి' పని దినాలు 14 వేలు



**వి.ఎల్.పురం :** గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి, కూలీలకు ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-2026)లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంకా 14 వేల పని దినాలు కల్పించాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 36 రోజులే ఉంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే శ్రామికులకు రోజుకు 400 పనిదినాల చొప్పున కల్పించాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో కొన్నిచోట్ల అవినీతి, మస్తర్ల విషయంలో అవకతవకలు జరిగాయి. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. శ్రామికులకు ఈకేవైసీ, ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో కొంతమేర పనులు మందగించాయి. వంద రోజుల పనిదినాలు 1,338 మందికే కల్పించగలిగారు. శ్రామికులకు సరాసరి వేతనం రూ.273.55 వరకు అందిస్తున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు చెబుతున్నారు. పనికి హాజరయ్యే క్రియాశీలక శ్రామికుల సంఖ్య వచ్చేనెలలో అధికంగా ఉంటుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన పనిదినాల లక్ష్యాన్ని అధిగమిస్తామని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు తెలిపారు.

# అంతర్ జిల్లా నేరస్థురాలి చేతివాటం



**అమలాపురం పట్టణం:** ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తూ ప్రయాణికుల లగేజీ, హ్యాండ్ బ్యాగ్‌ల్లోని విలువైన వస్తువులను చోరీ చేసే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం అమలాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్‌మీనా ఆ వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన నేరస్థురాలు మండి శివపార్వతి(33)ని అరెస్టు చేసి సుమారు రూ.20.5 లక్షల విలువైన 141.350 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై అమలాపురం పట్టణం, రూరల్, గోపాలపురం, గోకవరం, కర్నూల్, కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి.

**సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా..**

ఉప్పలగుప్తం మండలం బొరాయిపాలేనికి చెందిన తాటికొండ సత్యదేవి, ఆమె భర్త.. దుస్తులు కొనేందుకు సొంత ఆటోలో ఆదివారం రాత్రి అమలాపురం వచ్చారు. హైస్కూల్ సెంటర్ నుంచి గోఖలే సెంటర్ మధ్య ఓ మహిళ ప్రయాణికురాలి మాదిరి చంటిబిడ్డను ఎత్తుకుని వారి ఆటో ఎక్కి క్షణాల వ్యవధిలో దిగిపోయింది. ఇంతలో 3 తులాల బంగారు ఆభరణాలు ఉన్న తన హ్యాండ్ బ్యాగు పోయినట్లు సత్యదేవి గుర్తించారు. వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పర్యవేక్షణలో సీఐ వీరబాబు ఆధ్వర్యంలో ఎస్సై జోషి కేసు నమోదు చేశారు.

# రేవులు దాటడమే పెద్ద పరీక్ష



**పి.గన్నవరం, ఐ.పోలవరం:** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సోమవారం నుంచి మొదలయ్యాయి. వీటి తరువాత పదోతరగతి, డిగ్రీ, బీటెక్, తొమ్మిది నుంచి దిగువ తరగతుల వారికి జరుగుతాయి. నేటి నుంచి దాదాపు రెండు నెలల పాటు ఈ సీజన్ ఉంటుంది. ఈ సమయంలో మైదాన ప్రాంతాల నుంచే ఆయా కేంద్రాలకు చేరుకోవాలంటే నానా ఇబ్బందులు పడుతుంటారు. అలాంటిది లంకగ్రామాల నుంచి రేవులు దాటుకుని వచ్చేవారి పరిస్థితిని ఊహించుకోవచ్చు. రేవులు దాటి పరీక్షలు రాసి తిరిగి ఇళ్లకు చేరుకునేసరికి రాత్రి అవుతుంది. మళ్లీ ఉదయాన్నే రెండు మూడు గంటల ముందుగా బయలుదేరుతుంటామని వాపోతున్నారు.

పక్కనే ఉన్న పశ్చిమగోదావరి జిల్లా అయోధ్యలంక, మర్రిమూల గ్రామాల విద్యార్థులు నిత్యం వశిష్ఠ గోదావరి నదీపాయను మరపడవల్లో రేవులు దాటి వెళ్లి పి.గన్నవరం వైపు ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో చదువుతుంటారు. ఐ.పోలవరం మండలంలో వృద్ధగౌతమి మధ్యలో ఉన్న గోగుల్లంక, భైరవలంక గ్రామాల నుంచి గుత్తెనదీవి రేవు దాటి జి.వేమవరం వైపు వస్తుంటారు. పెదమల్లంక, ఆనగార్లంక, బూరుగులంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఊడుమూడిలంక గ్రామాల ప్రజలు వరదలులేని రోజుల్లో తాత్కాలిక మార్గాల నుంచి ప్రధాన రహదారుల వద్దకు చేరుకుని అక్కడి నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గ్రామాల నుంచి 150 మంది పైబడి విద్యార్థులు ఉంటారు. కాట్రేనికోన మండలం మగసానితిప్ప వెళ్లాలంటే 45 నిమిషాల పాటు మరపడవలో ప్రయాణించి ఈ గ్రామానికి చేరుకోవాలి. వీరు రావడానికి నిత్యం పడే వెతలు అన్నీఇన్నీ కావు.

# నిఘా కళ్లు పట్టేస్తున్నాయ్



**కాకినాడ:** నేరాలు కట్టడి.. ఛేదనలో స్మార్ట్ పోలీసింగ్‌తో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఓ వైపు డ్రోన్లతో పెట్రోలింగ్ చేస్తున్నారు. మరో వైపు అత్యాధునిక సీసీ కెమెరాలతో జిల్లా నలుమూలలా నిఘా పెడుతున్నారు. గతంలో ఏదైనా నేరంలో నిందితులను గుర్తించడానికి రోజులు, వారాలు సమయం పట్టేది. ఇప్పుడున్న సాంకేతికత ఉపయోగించుకుని గంటల్లోనే నేరస్థుల భరతం పడుతున్నారు. గతేడాది జరిగిన మేజర్ నేరాల్లో సుమారు 77 కేసులు సీసీ ఫుటేజీలతోనే ఛేదించగలిగారు. 6,400 గంటలు డ్రోన్ పెట్రోలింగ్‌తో కాకినాడ పోలీసులు తొలి స్థానంలో నిలిచారు.

**రెడ్‌లైట్ వెలిగితే చాలు..**

ఏఎన్‌పీఆర్ : ఆటోమేటిక్ నంబరు ప్లేట్ రికగ్నేషన్ కెమెరా ఇది. ట్రాఫిక్ కూడళ్లలో రెడ్ లైట్ వెలిగిన వైపు ఇది యాక్టివేట్ అవుతుంది. ఎవరి వాహనాలైనా జీబ్రాలైన్ దాటితే నంబరు ప్లేట్‌ల చిత్రం తీసి కమాండ్ కంట్రోల్ రూంకు పంపిస్తుంది. అక్కడ వాటిని పరిశీలించి వాహన యజమానులకు చలానాలు వేస్తారు. కాకినాడలో ఇప్పటి వరకు ఈ తరహా చలనాలు వేయలేదు.. ఇకపై అమలు చేయనున్నట్లు పోలీసులు చెబుతున్నారు. వీటిని నగరంలోకి వచ్చి, పోయే మార్గాల్లో వినియోగిస్తుంటారు.

ఏటీ కెమేరా: ముఖ్యమైన కూడళ్లలో అమర్చుతారు. ఆయా ప్రాంతాల్లో నిర్దేశిత సంఖ్య కంటే ఎక్కువ మంది ఉంటే పోలీసులను అలెర్ట్ చేస్తుంది. వన్ వే, నో పార్కింగ్ జోన్‌లలో ఏర్పాటు చేస్తుంటారు. అపసవ్యదిశలో వాహనాలు వచ్చినా, నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపినా పోలీసులకు సమాచారం పంపిస్తుంది.

**పాత నేరస్థులు కనిపిస్తే..**

ఎఫ్ఆర్ఎస్: ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ కెమెరా ఇది. పాత నేరస్థుల జాబితాను ఫొటోలతో సహ అనుసంధానిస్తారు. ఇవి ఉన్న ప్రాంతాల్లో ఎవరైనా పాత నేరస్థులు వస్తే వారి ఫొటోలను కమాండ్ కంట్రోల్ రూంకు పంపిస్తుంది. జిల్లాలో 144 మంది పాత నేరస్థుల కదలికలను గుర్తించి పోలీసులను అప్రమత్తం చేశాయి. పీటీజెడ్: పాన్, టిల్ట్, జూమ్ ఇది. రద్దీ ప్రాంతాలు, ర్యాలీలు, కళాశాలలు ఉన్నవైపు వీటిని అమర్చుతారు. కమాండ్ కంట్రోల్ రూం నుంచే నియంత్రించి ఎటువైపు దృశ్యాలు కావాలో అటు తిప్పి రికార్డు చేయిస్తారు.

జిల్లాలో ప్రభుత్వం అమర్చిన కెమెరాలు (మ్యాట్రిక్స్) : 550 పోలీసుల ప్రోత్సాహంతో పైవేటు వ్యక్తులు, సంస్థలు ఏర్పాటు చేసినవి : 3,720

'నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు, డ్రోన్ల వినియోగం బహుళ ప్రయోజనకారిగా ఉంటున్నాయి.. పోలీసులు వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్లను పంపించి అప్రమత్తం చేయడంతో ఆకతాయిలు, మందుబాబుల ఆగడాలు తగ్గుముఖం పట్టాయి. కాకినాడ నగరంలో సీసీ కెమెరాలతో పాత నేరస్థులు, రౌడీషీటర్ల కదలికలు తెలుసుకుంటున్నాం.' అని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు.

# యానాంలో కాంగ్రెస్ ఎంపీ బృందానికి చేదు అనుభవం



**యానాం:** 'వాక్ ఫర్ యానాం' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పుదుచ్చేరి కాంగ్రెస్ ఎంపీ వి.వైథిలింగం, మాజీ సీఎం నారాయణస్వామి బృందానికి మంగళవారం చేదు అనుభవం ఎదురైంది. ధరియాలతిప్ప 3వ నంబరు దీవి వద్ద ఆగస్టు 22 గ్యాస్ పైప్ పేలిన ప్రమాదంలో జరిగిన నష్టానికి, భవిష్యత్తులో విపత్తులు జరిగితే చేయాల్సిన సహాయం గురించి తేల్చాలంటూ నాలుగు గ్రామాల ప్రజలు 134 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. యానాం వస్తున్న సందర్భంగా ధరియలతిప్ప వద్ద ఆందోళనకారులను కలవడానికి ఎంపీ వైథిలింగం బృందం వెళ్లింది. ఘటన జరిగి 6 నెలలైనా ఎందుకని పార్లమెంటులో ఈ అంశంపై మాట్లాడలేదని గ్రామస్థులు నిలదీశారు. ఈ నేపథ్యంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు, ఎంపీకి మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీ.. గో బ్యాక్.. అంటూ నినాదాలు చేయడంతో వారు వెనుదిరిగారు.

# ఆసుపత్రిలో కోలుకునే సరికి ముగిసిన సమయం



**ముమ్మిడివరం:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలోని డా.ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని సోమవారం పరీక్ష రాస్తూ తీవ్ర అనారోగ్యానికి గురైంది. కాట్రేనికోన మండలం కందికుప్పకు చెందిన ఆమె పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత కడుపు నొప్పితో బాధపడటంతో అక్కడి వైద్య సిబ్బంది పరీక్షించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షల ఆందోళన, నీరసం తదితర కారణాలతో ఆమె అస్వస్థతకు గురైనట్లు వైద్యులు చెప్పారు. ఆమె కోలుకునే సరికి సమయం దాటిపోవడంతో పరీక్ష పూర్తిచేసే అవకాశం దక్కలేదు.

# 15 ఏళ్ల స్నేహం..రూ.5 లక్షల కోసం అంతం



**ఆరిలోవ, విశాఖసమాచారం:** ఆరిలోవలో సంచలనం సృష్టించిన కాపు లక్ష్మి హత్య కేసు మలుపులు, పోలీసుల ఛేదన తీరు క్రైం సినిమాను తలపించింది. పదిహేనేళ్ల నాటి ఒక 'రాంగ్ కాల్' పరిచయం, చివరకు ఒక ప్రాణాన్ని బలితీసుకోవడం సమాజంలోని వక్రబుద్ధులకు అద్దం పడుతోంది. ఈ విషాదకర ఘటన వెనుక ఉన్న పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ పరిధిలోని దుర్గానగర్‌లో ఈ నెల 11న జరిగిన కాపు లక్ష్మి (48) హత్య ఉదంతం నగరవాసులను ఉలిక్కిపడేలా చేసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను దారుణంగా హతమార్చి, నగదు, బంగారంతో పరారైన నిందితుడిని పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. నగర క్రైం డీసీపీ కె.లతా మాధురి పర్యవేక్షణలో 10 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి, సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీ కెమెరాల ఫుటేజీని జల్లెడ పట్టి నిందితుడి ఆట కట్టించారు. సోమవారం మీడియా సమావేశంలో వెల్లడైన వివరాల ప్రకారం.. ఈ ఘాతుకానికి పాల్పడిన విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన వంజరాపు శివ గంగరాజు అలియాస్ టాటూ శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

**అప్పులు..క్రికెట్ బెట్టింగ్**

నిందితుడు శివ బొబ్బిలిలో సెల్ ఫోన్ షాపు నడుపుతూనే టాటూలు వేసేవాడు. అయితే క్రికెట్ బెట్టింగ్‌లు, జూదానికి అలవాటు పడి ఏకంగా కోటి రూపాయలు పోగొట్టుకున్నాడు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన అతనికి మరో 25 లక్షల రూపాయల అప్పులున్నాయి. ఈ ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు అతను పాత పరిచయాలను ఆయుధంగా మార్చుకున్నాడు. సుమారు 15 ఏళ్ల క్రితం ఒక రాంగ్ కాల్ ద్వారా కాపు లక్ష్మితో పరిచయమైన శివ, ఆమెతో ఇన్నేళ్లుగా స్నేహం కొనసాగిస్తూ నమ్మకాన్ని పెంచుకున్నాడు. లక్ష్మి వద్ద చిట్టీల డబ్బు ఉంటుందని గ్రహించిన శివ, పథకం ప్రకారమే హత్యకు సిద్ధమై ఆమె ఇంటికి వెళ్లాడు.

**పథకం ప్రకారం..**

హత్య జరిగిన రోజున.. శివ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాడు. తన సొంత ఫోన్ వాడకుండా, బయట వ్యక్తి ఫోన్ నుంచి లక్ష్మికి కాల్ చేసి ఆమె ఒంటరిగా ఉన్న విషయాన్ని ధ్రువీకరించుకున్నాడు. ఇంటికి వెళ్లాక పెద్ద మొత్తంలో అప్పు అడగ్గా ఆమె నిరాకరించింది. అదే సమయంలో చిట్టీల ద్వారా వసూలైన రూ. 5 లక్షల నగదు కంటపడటంతో అతనిలో క్రూరత్వం నిద్రలేచింది. ముందుగా వేసుకున్న ప్రణాళికను అమలు చేస్తూ ఆమెను హత్య చేసి, ఇంట్లోని నగదుతో పాటు ఆమె ధరించిన బంగారు ఆభరణాలను దోచుకున్నాడు. ఏకంగా రెండున్నర గంటల పాటు ఆ ఇంట్లోనే ఉండి సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేసి, ఆపై ఆటోలు మారుస్తూ పరారయ్యాడు.

**పోలీసు బృందానికి అభినందన**

ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఏసీపీ నర్సింహమూర్తి, సీఐ చక్రధరరావు బృందాన్ని డీసీపీ లతామాధురి అభినందించారు. ఈ సందర్భంగా నగరవాసులకు ఒక ముఖ్యమైన సూచన చేశారు. కొత్తవారితో లేదా పరిచయమున్న వారితోనైనా ఆర్థిక లావాదేవీల విషయంలో, వ్యక్తిగత భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నమ్మకమే ఒక్కోసారి ప్రాణాంతకం కావచ్చని హెచ్చరించారు.

**కాశీ నుంచి ఢిల్లీ వరకూ పోలీసుల వేట**

దోచుకున్న సొమ్ముతో నిందితుడు దేశమంతా చక్కర్లు కొట్టాడు. విశాఖలో తాకట్టు పెట్టిన తన బైక్‌ను విడిపించుకుని బొబ్బిలికి వెళ్లాడు. అక్కడి నుంచి పోలీసుల కళ్లు గప్పేందుకు ఉత్తర భారతదేశంలోని ధన్‌బాద్, కాశీ, ఢిల్లీ, రాయగడ వంటి ప్రాంతాల్లో తలదాచుకున్నాడు. చివరకు ఈ నెల 22న రాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌లో అడుగుపెట్టగానే నిఘా పెట్టిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ. 5.05 లక్షల నగదుతో పాటు, బంగారు గొలుసు, పుస్తుల తాడు, నల్లపూసలు, ఉంగరాలు తదితర ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

# అంగన్వాడి కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు




**సాలూరు విశాఖ సమాచారం :** అంగన్వాడి కార్యకర్తలు సమస్యలు పరిష్కారం కోసం పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం రిలే నిరాహార దీక్షలు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసిన సమస్య పరిష్కారం కావడం లేదని అన్నారు ఎక్కడ వేసిన గొంగల అక్కడే చందముగా ఉన్నాయని గత ప్రభుత్వం అధికారంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీ కార్యకర్తలు కనీస వేతనం పెంచుతామని ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చారని అన్నారు హామీ నెరవేర్చడంలో విఫలం జరిగిందని అన్నారు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి అంగన్వాడి కార్యకర్తల కనీస వేతనం పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమానికి అంగన్వాడి వర్కర్ సెండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టి ప్రభావతి పార్వతి వై రమాదేవి పాల్గొన్నారు రిలే నిరాహార దీక్షలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

# పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** మహారాణిపేట మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలోని 133 కేంద్రాల్లో మొత్తం 30,633 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ప్రతి కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ వంటి కనీస వసతులు కల్పించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అక్రమాలకు తావులేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు చురుగ్గా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల భద్రత, సమాధాన పత్రాల తరలింపులో పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్షల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు 144 సెక్షన్ అమలు చేస్తూ, విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు ప్రత్యేక ఏర్పాట్లు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 2 నుంచి 13 వరకు, పదో తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి 28 వరకు జరగనున్నాయని కలెక్టర్ హరేందిర ప్రసాద్ వెల్లడించారు. ఇంటర్ పరీక్షలకు 1,247 మంది, పదో తరగతి పరీక్షలకు 1,141 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ఈ పరీక్షల కోసం కేటాయించిన కేంద్రాలలో నిబంధనల ప్రకారం ఇన్విజిలేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, విద్యుత్ , విద్యాశాఖ అధికారులు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# మాడుగుల డిగ్రీ కళాశాలకు ఎట్టకేలకు సొంతగూడు



**మాడుగుల, విశాఖసమాచారం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎట్టకేలకు పద్దెనిమిది ఏళ్ల తరువాత సొంత గూడు ఒనగూరుతోంది. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో కోటి రూపాయల పైచిలుకు వ్యయంతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి పనులన్నీ పూర్తిచేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి సొంత భవనాల్లో డిగ్రీ తరగతులు నిర్వహించేలా అధికారులు కృషి చేస్తున్నారు.

మాడుగులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2008లో మంజూరైంది. అప్పట్లో స్థలాన్ని ఎంపిక చేయకపోవడం, నిధులు విడుదల కాకపోవడతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల్లో తాత్కాలికంగా తరగతులను ప్రారంభించారు. సైన్స్, ఆర్ట్స్ గ్రూపులు వుండేవి. వసతి చాలకపోవడంతో ఉదయం ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకు జూనియర్ కళాశాల, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు డిగ్రీ కళాశాల తరగతులను నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో తరగతుల వేళలు తగ్గడం, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం వంటివి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సైన్స్ ల్యాబ్ ప్రాక్టికల్స్ కోసం చోడవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లి రావాల్సి వచ్చేంది. దీంతో పలువురు విద్యార్థులు ఇక్కడ చేరకుండగా, చోడవరం కళాశాలలో చేరడం మొదలుపెట్టారు. ఫలితంగా విద్యార్థుల సంఖ్య ఊహించినంతగా పెరగలేదు. సొంత భవనాల నిర్మాణంతోనే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విద్యార్థులు, అధ్యాపకులు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయితే సరైన స్థలం లభించకపోవడంతో సొంతూ గూడు ఒనగూరలేదు. ఇదే సమయంలో జూనియర్ కళాశాల యాజమాన్యం నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. ఇంటర్ తరగతులను పూర్తిస్థాయిలో నిర్వహించడానికి డిగ్రీ కళాశాలను వేరేచోటుకు తరలించాలని స్పష్టం చేశారు. దీంతో 2023 జూన్ నెలలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణానికి ఆనుకొని ఖాళీగా వున్న బాలికల వసతిగృహం భవనంలోకి డిగ్రీ కళాశాలను తరలించారు. ఇక్కడ మొత్తం 12 గదులు వుండడంతో పూర్తిస్థాయిలో తరగతుల నిర్వహణకు వీలుకలిగింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో బీఎస్సీ మ్యాథ్స్, కంప్యూటర్స్, బోటనీ, జువాలజీ, బీఏ హిస్టరీ, పాలిటిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ గ్రూపులు ఉన్నాయి. సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రిన్సిపాల్‌తో కలిపి 12 మంది అధ్యాపకులు ఉన్నారు. రెండుపూటలా తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఎప్పటికైనా బాలికల వసతిగృహ భవనాన్ని ఖాళీ చేయాల్సి వస్తుందన్న ఉద్దేశంతో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కళాశాలకు సొంత భవనాల కోసం స్థలం, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సర్వే నంబరు 261లో 3.46 ఎకరాలు, సర్వే నంబరు 262లో ఒక ఎకరాల 54 సెంట్లు.. మొత్తం ఐదు ఎకరాలను కేటాయించేలా కృషి చేశారు. భవనాలకు నిధుల కోసం కలెక్టర్ విజయకృష్ణన్‌తో మాట్లాడారు. గత ఏడాది ఆగస్టులో జిల్లా అభివృద్ధి నిధుల్లో నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ఆయన ఎంపీ నిధులు కోటి రూపాయిలు మంజూరు చేశారు. మొత్తం కోటి పది లక్షల రూపాయలతో సమగ్ర శిక్ష అధికారులు టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌తో భవన నిర్మాణ పనులు ప్రారంభింపజేశారు. , సర్వే నంబరు 262లోని స్థలంలో రెండు అంతస్థులతో భవనం నిర్మిస్తున్నారు. ఇందులో మొత్తం ఎనిమిది గదులు వుంటాయి. రెండో అంతస్థు శ్లాబ్ పనులు జరుగుతున్నాయి. ఈ భవనం పక్కనే ప్రిన్సిపాల్‌కు, ఆఫీసు కోసం చిన్నపాటి భవనం నిర్మిస్తున్నారు. ప్రహరీ గోడ, మరుగుదొడ్లు నిర్మిస్తారు. ఈ పనులన్నీ జూన్ చివరినాటికి పూర్తవుతాయని, జూలై ఒకటో తేదీ నుంచి కొత్త భవనంలో డిగ్రీ తరగతులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శాస్త్రి తెలిపారు. ఇంకా ల్యాబ్‌లు, గ్రంథాలయం, విద్యార్థులకు డైనింగ్ హాలు, అధ్యాపకులకు స్టాఫ్ రూమ్ వంటివి నిర్మించాల్సి వుందని, వీటిని నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

# ఇసుకాసురుల దందా



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని కొందరు అభాసుబాలు చేస్తున్నారు. ఇసుక నిల్వ, అమ్మకాలకు డిపోలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని పర్యవేక్షించాల్సిన గనులు, రెవెన్యూ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇసుక అక్రమార్కులు దర్జాగా వ్యాపారం సాగిస్తున్నారు. జిల్లాలోని నదుల్లో తగినంత ఇసుక నిల్వలు లేవన్న పర్యావరణ శాఖ నివేదికల ప్రకారం కూటమి ప్రభుత్వం 2024 జూలై 8వ తేదీన జిల్లాలోని అనకాపల్లి, నక్కపల్లి, అచ్యుతాపురం, చోడవరం, సబ్బవరం, మాడుగులలో ఇసుక డిపోలను టెండర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. గత వైసీపీ హయాంలో నర్సీపట్నం మండలం గబ్బాడ ఇసుక డిపోలో అక్రమాలు చోటు చేసుకోవడంతో కోర్టు ఆదేశాల మేరకు ఆ డిపోను సీజ్ చేశారు. దీంతో నర్సీపట్నం మినహా మిగిలిన చోట్ల ఇసుక డిపోలను తెరచి అటు రాజమహేంద్రవరం వద్ద గోదావరి నది నుంచి, ఇటు శ్రీకాకుళం జిల్లాలో నాగావళి, వంశధార నదుల నుంచి ఇసుకను తీసుకొచ్చి డిపోల్లో విక్రయాలు చేపట్టారు. ఆరంభంలో రోజూ 20 వేల టన్నుల ఇసుక అమ్ముడుపోయేది. అయితే ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన గనుల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం, మరోవైపు స్థానిక నేతలు తెర వెనుక ఉండి ఇసుక అక్రమార్కులకు సహకారం అందిస్తుండడంతో ఎక్కడికక్కడ నదుల్లో ఇసుక దోపిడీ మొదలైంది. సొంత అవసరాల కోసం సమీపంలోని నదుల్లో నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును అడ్డంపెట్టుకొని, ఎక్కడపడితే అక్కడ ఇసుక తవ్వకాలు జరుపుతూ దర్జాగా అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారు. ప్రధానంగా శారదా, వరహా, పెద్దేరు, తాండవ నదుల్లో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డిపోలు వెలవెలబోతున్నాయి. స్థానికంగా వుండే కూటమి పార్టీలకు చెందిన కొంతమంది నేతలు, ఇసుక అక్రమార్కులకు దన్నుగా నిలుస్తూ, ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఇక బహుళ అంతస్థుల భవనాలు, పరిశ్రమలు నిర్మాణం, ప్రభుత్వ పనులకు పెద్ద మొత్తంలో ఇసుక అవసరమైన వారు నేరుగా రాజమహేంద్రవరం లేదా శ్రీకాకుళం నుంచి ఇసుకను రప్పిస్తున్నారు. దీంతో టెండర్ల ద్వారా ఇసుక డిపోలను దక్కించుకొన్న వ్యాపారులు కొనుగోళ్లు లేక లబోదిబోమంటున్నారు. అనకాపల్లి, చోడవరం, మాడుగుల ఇసుక డిపోల్లో ఆరు నెలల నుంచి ఇసుక కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. నక్కపల్లి, అచ్యుతాపురం డిపోల నుంచి ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ నిర్మాణాలకు ఇసుకను తీసుకెళుతున్నారు. గనుల శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, జిల్లాలోని నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలను కట్టడిచేయాలని, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఉపాధ్యాయులకు విలువ ఇవ్వని విద్యార్థులు
## విద్యార్థులకు భయం చెప్పని తల్లిదండ్రులు

**దేవరపల్లి, (విశాఖ సమాచారం):** మునుపటి కాలంలో విద్యార్థులు ఉపాధ్యాయులను తమ యొక్క జీవితాన్ని మంచి మార్గములో నడిపే వారిగా వారిని గౌరవించే వారు మాతృ దేవోభవ పితృ దేవోభవ ఆచార్య దేవో భవ అని తల్లి తండ్రులు వారి యొక్క పిల్లలకు చిన్నపాటి నుంచి మంచి లక్షణాలను అలవాటు చేసేవారు. ఈ ఆధునిక కాలంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పట్ల గౌరవం లేకుండా జీవితం పట్ల అవగాహన లేకుండా నైతిక విలువలు లేకుండా విద్యార్థులు వారి యొక్క భవిష్యత్తుని నాశనం చేసుకొంటున్నారు, తల్లిదండ్రులు వారు భయం చెప్పకుండా ఉపాధ్యాయులను చెప్పనివకుండా విద్యార్థులు వారి యొక్క భవిష్యత్తుని ఏ విధంగా మంచి మార్గం లో నడవాలి అనే విషయాన్ని తెలుసుకోకుండా చేసి వారి యొక్క భవిష్యత్తుని నాశనం చేసుకోవడానికి తల్లిదండ్రులే ముఖ్యకారణంగా మారుతున్నారని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య జూమ్ మీటింగ్ లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఇతర అధికారులతో మాట్లాడారు.

# చెత్తశుద్ధి కరవు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** చెత్తను పర్యావరణహితంగా కాపులుప్పాడలోని యార్డుకు తరలించేందుకు జోన్‌ల వారీగా ఏర్పాటుచేసిన క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) పేరుతో వివిధ జోన్‌లలో ఏర్పాటుచేసిన ప్లాంట్లు ప్రస్తుతం పనిచేయడం లేదు. రెండు ప్లాంట్ల నిర్వహణ దక్కించుకున్న ఓ సంస్థ పని ప్రారంభించడంలో తాత్సారం చేస్తోంది. అదే సంస్థ..మరొక ప్లాంటు నిర్వహణను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించకుండా దాగుడుమూతలాడుతోంది. దీంతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో చెత్త కొండలా పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో అధికారులే ఓపెన్ టిప్పర్లతో చెత్తను కాపులుప్పాడ తరలిస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలోని నివాసాలు, వాణిజ్య దుకాణాలు, హోటళ్లు, మార్కెట్‌ల నుంచి వచ్చే చెత్తను సమీపంలోని జోన్‌ల పరిధిలో ఏర్పాటుచేసిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)లకు క్లాప్ వాహనాల ద్వారా చేరుస్తారు. అక్కడ చెత్తను నేలపై వేయకుండా క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ పేరుతో ఏర్పాటుచేసిన గల్లాలో అన్‌లోడ్ చేస్తారు. ప్లాంటులోని ప్రత్యేక యంత్రాలు గల్లాలో పడిన చెత్తను కేక్ మాదిరిగా కంప్రెస్ చేసి, కంటెయినర్ లాంటి హుక్‌లోడర్‌లోకి లోడ్ చేస్తాయి. అలా కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఒక్కో జోన్‌లో సీసీఎస్ ప్లాంట్‌కు వచ్చే చెత్త పరిమాణం ఆధారంగా హుక్‌లోడర్లు (కంటెయినర్‌లాంటి లారీలు)ను జీవీఎంసీయే కొనుగోలు చేసి, వాటి నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగిస్తుంది. జీవీఎంసీ పరిధిలో ముడసర్లోవ, టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక, చీమలాపల్లిలో సీసీఎస్ ప్రాజెక్టులను ఏర్పాటుచేసి కాంట్రార్లకు అప్పగించింది. గాజువాక, టౌన్‌కొత్తరోడ్డు, చీమలాపల్లి సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణను 'రాసా' సంస్థ చాలాకాలంగా చేపట్టగా, ముడసర్లోవలోని సీసీఎస్ ప్రాజెక్టును మంజునాథ సంస్థ ఇప్పటికీ నిర్వహిస్తోంది. అయితే జీవీఎంసీ ఒక్కో ప్లాంటు నిర్వహణకు ఏడాదికి సగటున రూ.2 కోట్లు వరకూ వెచ్చిస్తున్నాసరే, కాంట్రాక్టర్లు చెత్తను పూర్తిగా తరలించడం లేదనే ఫిర్యాదులు కొన్నాళ్ల కిందట వెల్లువెత్తాయి. దీనిపై కమిషనర్ కేతన్‌గార్గ్ స్పందించి ప్రాజెక్టులను స్వయంగా తనిఖీ చేయగా, టౌన్ కొత్తరోడ్డు, గాజువాక ప్లాంట్ల వద్ద అవకతవకలు బయటపడ్డాయి. జీవీఎంసీ సమకూర్చిన హుక్ లోడర్లను సైతం మూలనపెట్టేసి, నిబంధనలకు విరుద్ధంగా, పర్యావరణానికి హాని కలించేలా ఓపెన్ టిప్పర్లతో చెత్తను కాపులుప్పాడ తరలిస్తున్నట్టు గుర్తించారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రూ.81 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఆ మొత్తాన్ని మెకానికల్ విభాగం అధికారులు కాంట్రాక్టర్ నుంచి ఎన్నో ప్రయత్నాల తర్వాత రాబట్టారు.

**ప్లాంట్లను మూసేసిన కాంట్రాక్టర్**

జీవీఎంసీ పరిధిలోని గాజువాక, చీమలాపల్లి, టౌన్‌కొత్తరోడ్డు, ముడసర్లోవలోని సీసీఎస్ ప్రాజెక్టులను ఎనిమిది నెలలపాటు నిర్వహణకు రెండు నెలల కిందట జీవీఎంసీ అధికారులు టెండర్లు పిలిచారు. చీమలాపల్లి, టౌన్‌కొత్తరోడ్డు ప్రాజెక్టులను గతంలో ఆ ప్రాజెక్టులను నిర్వహించిన 'రాసా' సంస్థ తిరిగి దక్కించుకోగా, గాజువాక, ముడసర్లోవ ప్రాజెక్టులను మంజునాథ సంస్థ దక్కించుకుంది. టెండరు నిబంధనల ప్రకారం గాజువాక ప్రాజెక్టును రాసా సంస్థ కొత్తగా టెండరు దక్కించుకున్న మంజునాథ సంస్థకు అధికారికంగా ఆడిట్‌చేసి అప్పగించాలి. అయితే ఇంతవరకూ గాజువాక ప్లాంట్‌ను కొత్తకాంట్రాక్టర్‌కు అప్పగించలేదు. దీంతో ఆ ప్లాంటులో సీసీఎస్ ప్రాజెక్టును వినియోగించలేని పరిస్థితి ఏర్పడింది. గాజువాక జోన్ పరిధిలోని చెత్తను కొద్దికొద్దిగా ఓపెన్ టిప్పర్ల ద్వారా కాపులుప్పాడ యార్డుకు తరలిస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి సమస్య తలెత్తుతోంది. మరోవైపు యార్డులో చెత్త పూర్తిగా తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక చీమలాపల్లి, టౌన్‌కొత్తరోడ్డు ప్రాజెక్టులను 'రాసా' సంస్థ తిరిగి దక్కించుకున్నందున ఆ ప్లాంట్‌లను ఎలాంటి ఆడిట్ అవసరం లేకుండానే యథావిధిగా పనిచేయించేందుకు అవకాశం ఉంది. కానీ ఇంతవరకూ ఆచూకీ లేదు, దీంతో ఆ రెండు ప్లాంట్లలో చెత్తను కూడా అధికారులే ఓపెన్ టిప్పర్లను సమకూర్చుకుని కాపులుప్పాడ తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రాసాపై అమితమైన ప్రేమ**

రెండు ప్లాంట్లను నిర్వహించకుండా ముఖం చాటేయడంతోపాటు, గాజువాక ప్లాంటును కొత్తకాంట్రాక్టర్‌కు అప్పగించకుండా దాగుడుమూతలు ఆడుతున్న 'రాసా'పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకనో వెనుకాడుతున్నారు. కాంట్రాక్టర్ ఎవరైనా టెండరు దక్కించుకుని పని ప్రారంభించకపోతే నిబంధనల ప్రకారం రద్దు చేసి ఎల్2గా నిలిచిన వారికి అప్పగించేందుకు అధికారులకు అధికారం ఉంటుంది. కానీ టౌన్‌కొత్తరోడ్డు, చీమలాపల్లి ప్రాజెక్టుల విషయంలో అధికారులు ఎందుచేతనో అలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్న కాంట్రాక్టు సంస్థకు ఇప్పటికే అధికారులు మూడు నోటీసులు జారీచేసినా అటువైపు నుంచి కనీసం స్పందన లేదు. జీవీఎంసీలోని కొందరు ఉన్నతాధికారులు, రాష్ట్రస్థాయిలో మునిసిపల్ శాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారి ఒకరు సంబంధిత కాంట్రాక్టర్‌కు అండగా ఉండడం వల్లే అధికారులు జారీచేసిన నోటీసులకు స్పందించడం లేదనే అభిప్రాయం జీవీఎంసీ అధికారుల్లో వ్యక్తమవుతోంది.జీవీఎంసీ పరిధిలోని నివాసాలు, వాణిజ్య దుకాణాలు, హోటళ్లు, మార్కెట్‌ల నుంచి వచ్చే చెత్తను సమీపంలోని జోన్‌ల పరిధిలో ఏర్పాటుచేసిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)లకు క్లాప్ వాహనాల ద్వారా చేరుస్తారు. అక్కడ చెత్తను నేలపై వేయకుండా క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ పేరుతో ఏర్పాటుచేసిన గల్లాలో అన్‌లోడ్ చేస్తారు. ప్లాంటులోని ప్రత్యేక యంత్రాలు గల్లాలో పడిన చెత్తను కేక్ మాదిరిగా కంప్రెస్ చేసి, కంటెయినర్ లాంటి హుక్‌లోడర్‌లోకి లోడ్ చేస్తాయి. ఉన్నతాధికారులు, రాష్ట్రస్థాయిలో మునిసిపల్ శాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారి ఒకరు సంబంధిత కాంట్రాక్టర్‌కు అండగా ఉండడం వల్లే అధికారులు జారీచేసిన నోటీసులకు స్పందించడం లేదనే అభిప్రాయం జీవీఎంసీ అధికారుల్లో వ్యక్తమవుతోంది.

# క్రీడా సినిమా సమాచారమ్

## రిలీజ్ డేట్ ప్రకటించిన సమంత 'మా ఇంటి బంగారం'..




ప్రస్తుతం పాన్ ఇండియా హీరోయిన్ గా కొనసాగుతూ.. అటు ఆర్మాక్స్ మీడియా సర్వేలో కూడా ఎప్పటికప్పుడు టాప్ టెన్ లో నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుంటూ దూసుకుపోతున్న సమంత గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. నాగచైతన్యతో ప్రేమ, పెళ్లి, విడాకుల విషయంలో వార్తల్లో నిలిచిన ఈమె.. ఆ తర్వాత విమర్శలు ఎదుర్కొని కొంతకాలం ఇండస్ట్రీకి దూరమైంది. వ్యక్తిగతంగానే కాకుండా అటు ఆరోగ్యపరంగా మయోసైటీస్ వ్యాధి బారినపడి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న ఈమె.. ఏడాది పాటు ఇండస్ట్రీకి గ్యాప్ ఇచ్చి మళ్లీ గట్టి కంబ్యాక్ ఇచ్చింది.

ఆ తర్వాత 'సిటాడెల్ :హనీ బన్నీ' వెబ్ సిరీస్ తో సంచలనం సృష్టించి పలు అవార్డులు కూడా సొంతం చేసుకుంది. పైగా బాలీవుడ్ లో తన కెరియర్ కు పునాదులు వేసిన రాజ్ నిడిమోరుతో గత ఏడాది ఏడడుగులు వేసిన ఈమె.. ఇప్పుడు తెలుగు సినిమాలపై దృష్టి సారించింది. అందులో భాగంగానే తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై 'శుభం' అనే సినిమాను నిర్మించి, నిర్మాతగా సక్సెస్ అయిన ఈమె.. మళ్ళీ తన బ్యానర్ లోనే 'మా ఇంటి బంగారం' అనే సినిమాను నిర్మించడమే కాకుండా నటిస్తోంది కూడా.. ప్రముఖ లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వంలో ముచ్చటగా మూడోసారి వస్తున్న చిత్రం ఇది.

ఇదివరకే వీరిద్దరి కాంబినేషన్లో 'జబర్దస్త్' సినిమా వచ్చి ఫ్లాప్ అయింది. ఆ తర్వాత 'ఓ బేబీ' సినిమా వచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఈ కాంబినేషన్లో సినిమా అనడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. దీనికి తోడు ఇటీవల ఈ సినిమా నుండి విడుదల చేసిన టీజర్ లో కూడా సమంత తన యాక్షన్ పర్ఫామెన్స్ తో అదరగొట్టేసింది. ఇక ఇప్పుడు అధికారికంగా రిలీజ్ డేట్ ప్రకటిస్తూ షేర్ చేసిన పోస్ట్ అభిమానులలో అంచనాలు పెంచేసింది.


ముఖ్యంగా సమ్మర్ హాలిడేస్ ను క్యాష్ చేసుకోవడానికి.. వేసవిలో అభిమానులను చిల్ చేయడానికి సమంతా మే 15వ తేదీన 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ మేరకు తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా అఫీషియల్ గా అనౌన్స్మెంట్ చేసిన పోస్టర్ కూడా వైరల్ గా మారింది

## విజయ్- రష్మిక పెళ్లి టైటిల్ ప్రకటన



విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న అభిమానులకు పెద్ద పండగ లాంటి వార్త! గత కొన్ని ఏళ్లుగా సోషల్ మీడియాలో వీరిద్దరి గురించి వస్తున్న ఊహాగానాలకు రూమర్లకు తెరదించుతూ.. ఈ జంట తమ వివాహ ప్రకటనను ఇంత హృద్యంగా చేయడం విశేషం. విజయ్ – రష్మిక తమ పెళ్లికి –ది వెడ్డింగ్ ఆఫ్ VIROSH` అని పేరు పెట్టడం వెనుక ఒక గొప్ప ఉద్దేశ్యం ఉంది. ఈ పేరును ఏ వెడ్డింగ్ ప్లానరో లేదా ఫ్యామిలీ మెంబరో సూచించలేదు. ఏళ్ల తరబడి వీరిద్దరినీ కలిపి చూడాలనుకున్న అభిమానులు విజయ్ – రష్మిక పేర్లను కలిపి సృష్టించిన పేరే ఈ VIROSH తమ ప్రేమికులు ఇచ్చిన పేరునే తమ జీవితకాల వేడుకకు పేరుగా మార్చుకోవడం ద్వారా అభిమానులను ఈ సెలబ్రేషన్‌లో భాగస్వాములను చేశారు. తాజాగా షేర్ చేసిన శుభలేఖలో ఉన్న ప్రతి పదం అభిమానులపై వారికి ఉన్న గౌరవాన్ని తెలియజేస్తోంది. మేము ఏ ప్లాన్ చేసుకోకముందే, మా గురించి మేము ఏదీ నిర్ణయించుకోకముందే.. మీరు అక్కడ ఉన్నారు. ఎంతో ప్రేమతో మీరు మాకు ఒక పేరు ఇచ్చారు.. అదే ఎ×=ూూ. అందుకే ఈరోజు మా కలయికకు మీ గౌరవార్థం అదే పేరు పెడుతున్నాం.. అని తెలిపారు. గీత గోవిందం నుండి విరోష్ వరకు.. గీత గోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాలతో ఈ జంట వెండితెరపై సృష్టించిన మ్యాజిక్ అంతా ఇంతా కాదు. అప్పటి నుండే వీరిద్దరూ రియల్ లైఫ్ జోడీ అయితే బాగుంటుందని కోట్లాది మంది కోరుకున్నారు. నేడు వారి కల నిజమవుతుండటంతో సోషల్ మీడియా అంతా –విరోష్– నినాదాలతో హోరెత్తిపోతోంది. తమ ప్రైవేట్ వేడుకను అందరి వేడుకగా మార్చడంలో విజయ్ స్టైల్ స్పష్టంగా కనిపిస్తోంది. తమ ఎదుగుదలలో తోడుగా నిలిచిన ప్రతి అభిమానికి ఇది ఒక కృతజ్ఞతా పూర్వక నివాళి. –ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్– అనేది 2026లోనే అత్యంత చర్చనీయాంశమైన వేడుకగా నిలవబోతోంది. ఇది కేవలం ఇద్దరు స్టార్ల పెళ్లి మాత్రమే కాదు, అభిమానుల మొండి నమ్మకానికి దక్కిన విజయం!

## రెండున్నర గంటల్లో 2 గంటలు పవన్‌నే చూస్తారు




హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్‌లో ఈరోజు (ఫిబ్రవరి 22) సాయంత్రం జరిగిన –ఆరా ఆఫ్ ఉస్తాద్– సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు హరీష్ శంకర్ ప్రసంగం అభిమానుల్లో పూనకాలు తెప్పించింది. ఆయన స్పీచ్‌లోని ఎగ్జయిట్ చేసే విషయాలను పరిశీలిస్తే.. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ గారి ఫ్యాన్స్ ఏం కోరుకుంటారో అవన్నీ ఉన్నాయని అన్నారు. ఆయన హెయిర్ స్టైల్, డ్రెస్సింగ్, ఆయన సెన్సాఫ్ హ్యూమర్, సహజంగా ఉండే ఎనర్జీ.. ఇలా ప్రతిదీ ఈ సినిమాలో చూడబోతున్నారు. సాధారణంగా సినిమాల్లో హీరో ఎంతసేపు కనిపిస్తారు. కానీ ఈ రెండున్నర గంటల సినిమాలో దాదాపు 2 గంటల పాటు పవన్ కల్యాణ్ గారే స్క్రీన్ మీద ఉంటారు. ఆయన బాడీ లాంగ్వేజ్, ఆ నవ్వు.. ప్రతి ఫ్యాన్‌కి నచ్చేలా డిజైన్ చేశాను. కలెక్షన్లు, సక్సెస్ అనేది దైవాధీనం.. దాని గురించి నేను మాట్లాడను. కానీ, సినిమాకి వచ్చిన ప్రతి పవన్ కల్యాణ్ అభిమాని మా అన్నను ఇలా చూడాలనుకున్నాం! అని గర్వంగా చెప్పుకునేలా ఈ సినిమా ఉంటుంది. ఆయన ఈ సినిమా కోసం కోట్లు వదులుకుని టైమ్ ఇచ్చారు.. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను! అని అన్నారు. సాయంత్రం విద్యార్థులకు పండగే పండగ! ఈవెంట్ జరిగిన మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రాంగణం పవర్ స్టార్ నినాదాలతో మార్మోగిపోయింది. వేలాదిగా విద్యార్థులు, అభిమానులు తరలివచ్చారు. దేవి శ్రీ ప్రసాద్ కంపోజ్ చేసిన సెకండ్ సింగిల్ –ఆరా ఆఫ్ ఉస్తాద్– ప్రోమోలో పవన్ కల్యాణ్ ఒక మార్కెట్ యార్డులో సన్ గ్లాసెస్ పెట్టుకుని.. భుజాన గన్ వేసుకుని టీ గ్లాసుతో నడిచివచ్చే షాట్స్ కేక పుట్టిస్తున్నాయి. ఈ వేడుకలో నిర్మాత నవీన్ యెర్నేని, రవిశంకర్ (మైత్రీ మూవీ మేకర్స్), మల్లారెడ్డి ఇతర చిత్ర బృందం పాల్గొన్నారు. ఉస్తాద్ భగత్ సింగ్ ప్రపంచవ్యాప్తంగా మార్చి 26న భారీ ఎత్తున విడుదల కానుంది. సమ్మర్ బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి ఉస్తాద్ సిద్ధంగా ఉన్నాడనే సంకేతాలు బలంగా ఉన్నాయి. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తుండగా, శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. హరీష్ శంకర్ చెప్పినట్లుగా 2 గంటల పాటు పవన్ కల్యాణ్ స్క్రీన్ మీద ఉంటే.. థియేటర్లలో రచ్చ ఎలా ఉంటుందో ఊహించవచ్చు.

## భారత్‌కు ఎదురైన ఘోర పరాభవం




ఆటలో గెలుపోటములు సహజం. కానీ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో, టైటిల్ ఫేవరెట్ ముద్రతో పెద్ద టోర్నీల్లో బరిలోకి దిగిన జట్టు.. కీలక దశలో కనీస పోటీ లేకుండా ఓడిపోవడం అభిమానులు జీర్ణించుకోలేని విషయం. టీ20 ప్రపంచకప్ సూపర్–8 పోరులో దక్షిణాఫ్రికా చేతిలో టీమ్‌ఇండియా అలాగే ఓడింది. బౌలింగ్‌లో మంచి ఆరంభం లభించినా ఉపయోగించుకోని జట్టు.. తర్వాత బ్యాటింగ్‌లో ప్రత్యర్థి వ్యూహానికి సులువుగా లొంగిపోయింది. జట్టు కూర్పు దగ్గర్నుంచి అన్ని విషయాల్లో తప్పటడుగులే కనిపించాయి.

**మాస్టర్ స్ట్రోక్ అనుకున్నారా?**

దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఆట ఆరంభానికి ముందు అందరూ అవాక్కయ్యే పరిణామం చోటు చేసుకుంది. తుది జట్టు చూసి ఆశ్చర్యపోని వాళ్లు లేరు. అక్షర్ పటేల్ మ్యాచ్ ఆడట్లేదంటే అతడికేమైనా గాయమైందేమో.. ఇంకేదైనా సమస్య తలెత్తిందేమో అనుకున్నారు. కానీ ఆశ్చర్యకరంగా అతను ఫిట్‌గా ఉన్నా సరే, పక్కన పెట్టి.. వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకుంది జట్టు యాజమాన్యం. గ్రూప్ దశలో అక్షర్ పటేల్ 3 మ్యాచ్‌లు ఆడి 6 వికెట్లు తీశాడు. పాకిస్థాన్‌తో కీలక పోరులోనూ పొదుపుగా బౌలింగ్ చేసి రెండు ముఖ్యమైన వికెట్లు తీశాడు. సుందరేమో.. గ్రూప్ దశలో ఆడింది ఒక్కటే మ్యాచ్. అది కూడా నెదర్లాండ్స్‌పై. అలాంటి చిన్న జట్టుపై ఒక్క వికెట్ లేకుండా 36 పరుగులు సమర్పించుకున్నాడు. మరి ఏ ఉద్దేశంతో అక్షర్‌ను కాదని సుందర్‌ను తుది జట్టులోకి తీసుకున్నారన్నది అంతుబట్టని విషయం. అక్షర్ బ్యాటింగ్‌లో సుందర్‌కు ఏమీ తీసిపోడు. అతను ఎడమచేతి వాటం బౌలర్ కావడం వల్ల బౌలింగ్‌లో వైవిధ్యమూ ఉండేది. సుందర్‌ను ఆడించడం ద్వారా దక్షిణాఫ్రికాకు మాస్టర్ స్ట్రోక్ ఇద్దామనుకుందేమో జట్టు యాజమాన్యం. కానీ స్ట్రోక్ తిరిగి భారత్‌కే తగిలింది. సుందర్‌ను ఆడించి, అతడినైనా పూర్తిగా వాడుకున్నారా అంటే అదీ లేదు. రెండు ఓవర్లకు పరిమితం చేశారు. గత ఏడాది కాలంలో సుందర్‌ను వివిధ ఫార్మాట్లలో తుది జట్టులో ఆడించినపుడు ఎక్కువసార్లు తనను బౌలింగ్‌లో పూర్తి స్థాయిలో ఉపయోగించుకోలేదు. తన బౌలింగ్ అంత ప్రభావవంతంగా లేకపోవడమే అందుకు కారణం కావచ్చు. అక్షర్ చివరి 7 టీ20ల్లో 14 సగటుతో 13 వికెట్లు తీయడం గమనార్హం. ఆదివారం అతను ఆడి ఉంటే కచ్చితంగా భారత బౌలింగ్ ఇంకాస్త ప్రభావవంతంగా ఉండేదనే విషయంలో భిన్నాభిప్రాయాలు లేవు. మరోవైపు రింకు సింగ్‌ను కొంత కాలం పక్కన పెట్టి, ఉన్నట్లుండి మళ్లీ ప్రపంచకప్‌నకు ఎంపిక చేయడం, తుది జట్టులో ఆడిస్తుండడం మీదా విమర్శలు తప్పట్లేదు. శ్రేయస్ అయ్యర్, జితేశ్ శర్మ లాంటి నాణ్యమైన బ్యాటర్లు ఉండగా.. రింకుకే అవకాశం ఇవ్వడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అతడికి గతంలో ఎక్కువగా బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ ప్రపంచకప్‌లో అమెరికాపై, దక్షిణాఫ్రికాపై జట్టు పీకల్లోతు కష్టాల్లో ఉండగా నిలిచి ఆదుకోవాల్సిన స్థితిలో పేలవంగా ఆడి ఔటయ్యాడు. నమీబియా లాంటి చిన్న జట్టుపై 6 బంతుల్లో ఒక్క పరుగే చేసి వెనుదిరిగాడు. ఇక టీ20ల్లో ఆడించిన ప్రతిసారీ రాణిస్తున్న కుల్‌దీప్ యాదవ్‌ను తుది జట్టుకు దూరంగా ఉంచడం మీదా విమర్శలు వస్తున్నాయి. అతను గత ఏడాది ఆసియా కప్ నుంచి 14 టీ20లు ఆడి 12.88 సగటుతో 26 వికెట్లు పడగొట్టడం విశేషం. ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో కీలక పోరులో 3 ఓవర్లలో 14 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసిన అతడికి.. తర్వాత అవకాశమే రాలేదు. అక్షర్‌ను పక్కన పెట్టాలనుకున్నపుడు కుల్‌దీప్‌ను అయినా ఎంచుకుని ఉండాల్సింది. ఆడించిన ప్రతిసారీ ఉత్తమ ప్రదర్శన చేస్తున్నప్పటికీ కుల్‌దీప్‌పై పదే పదే వేటు వేయడంలో కెప్టెన్, కోచ్ ఆంతర్యమేంటో?

**మార్పులు తప్పవా?**

టీమ్‌ఇండియాకు సఫారీల దెబ్బ గట్టిగానే తాకింది. గ్రూప్ దశలో భారత్ తడబడ్డా పుంజుకుని మ్యాచ్‌లు గెలిచింది. అప్పుడే జట్టు సామర్థ్యంలో సందేహాలు కలిగినా.. విజయాలతో సాగిపోవడంతో దాని గురించి పెద్ద చర్చ లేకపోయింది. కానీ ఇప్పుడు దక్షిణాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడడం.. కూర్పు, వ్యూహాల విషయంలో తీవ్ర విమర్శలు వస్తుండడంతో జట్టు యాజమాన్యానికి సెగ గట్టిగానే తాకినట్లు కనిపిస్తోంది. ఒక్క ఓటమితో సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు జట్టు యాజమాన్యం ఇష్టానుసారం వ్యవహరించే పరిస్థితి లేదు. కూర్పు విషయంలో జాగ్రత్తగా అడుగులు వేయాల్సిందే. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిందే. తర్వాతి మ్యాచ్‌లకు జట్టులో మార్పులు ఉంటాయనే సంకేతాలు ఇచ్చాడు సహాయ కోచ్ టెన్ డస్కాటే. గురువారం జింబాబ్వేతో పోరుకు సుందర్ స్థానంలో అక్షర్ రావడం లాంఛనమే. కుల్‌దీప్‌కు కూడా అవకాశముంటుందా అన్నది చూడాలి. జింబాబ్వేతో మ్యాచ్ జరిగే చెపాక్ స్టేడియం స్పిన్నర్లకు బాగా సహకారం అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఒక బ్యాటర్ (రింకు సింగ్) లేదా ఒక పేసర్ (అర్ష్‌దీప్ సింగ్)ను తగ్గించుకుని, కుల్‌దీప్‌ను ఆడించే అవకాశాలను కొట్టిపారేయలేం. డస్కాటే మాటల్ని బట్టి చూస్తే బ్యాటింగ్ ఆర్డర్లోనూ ఒకట్రెండు మార్పులు అనివార్యంగా కనిపిస్తున్నాయి. ప్రపంచకప్ ముంగిట సూపర్ ఫామ్‌లో ఉన్నప్పటికీ, టోర్నీలో ఘోరాతి ఘోరంగా విఫలమవుతున్న అభిషేక్ శర్మపై వేటు వేయాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అలాగే తిలక్ వర్మ సైతం తన ఆటతీరుతో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. వీరిలో ఒకరిని తప్పించి సంజు శాంసన్‌ను ఆడించే అవకాశాలను కొట్టిపారేయలేం.

## జింబాబ్వేపై ఘనవిజయం




టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ దూసుకుపోతోంది. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆ జట్టు.. హెట్‌మయర్ (85; 34 బంతుల్లో 7ఐ4, 7ఐ6) విధ్వంసంతో సూపర్ 8లోనూ ఘనంగా బోణీ కొట్టింది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ సోమవారం గ్రూప్–1 మ్యాచ్‌లో 107 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తుగా ఓడించింది. హెట్‌మయర్‌తో పాటు రోమన్ పావెల్ (59; 35 బంతుల్లో 4ఐ4, 4ఐ6) మెరవడంతో మొదట విండీస్ 6 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఛేదనలో జింబాబ్వే తేలిపోయింది. మోటీ (4/28), అకీల్ హొసీన్ (3/28), ఫోర్డ్ (2/27) ధాటికి 17.4 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. బ్రాడ్ ఎవాన్స్ (43; 21 బంతుల్లో 2ఐ4, 5ఐ6) టాప్ స్కోరర్.

**తేలిపోయిన జింబాబ్వే**

కొండంత ఛేదనలో జింబాబ్వే నుంచి కనీస ప్రతిఘటన కూడా కరవైంది. స్పిన్నర్లు మోటీ, అకీల్ హొసీన్ ధాటికి విలవిల్లాడిన ఆ జట్టు.. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. ఏ దశలోనూ పోటీలో లేదు. రెండో ఓవర్లో మరుమాని (14)ని ఔట్ చేయడం ద్వారా ఆ జట్టు పతనాన్ని ఫోర్డ్ ఆరంభించాడు. ఆ తర్వాత బెనెట్ (5), ర్యాన్ బర్ల్ (0)ను అకీల్ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. కాసేపటి తర్వాత మయర్స్ (28)ను మోటీ వెనక్కి పంపడంతో జింబాబ్వే 52/4తో చిక్కుల్లో పడింది. అయితే మున్యోంగా (14)తో కలిసి రజా (27) ఇన్నింగ్స్ నడిపించడంతో ఆ జట్టు 10 ఓవర్లలో 87/4తో నిలిచింది. ఓటమి అంతరాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేసింది. కానీ 11వ ఓవర్లో మోటీ.. రజా, ముసెకివాలను ఔట్ చేయడంతో జింబాబ్వేకు భారీ పరాజయం ఖాయమైపోయింది. కానీ ఆఖర్లో ఎవాన్స్ అద్భుత బ్యాటింగ్ విన్యాసాలతో ఆ జట్టు అభిమానులను అలరించాడు. అతడు ఎంగరవ (7 నాటౌట్)తో ఆఖరి వికెట్‌కు 44 పరుగులు జోడించాడు.

**విండీస్ పరుగుల వరద**

విండీస్ ఇన్నింగ్స్‌లో హెట్‌మయర్ ఆటే హైలైట్. ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ హిట్టర్.. జింబాబ్వే బౌలింగ్‌ను ఊచకోత కోశాడు. రోమన్ పావెల్, రూథర్‌ఫర్డ్ కూడా రెచ్చిపోవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. టాస్ గెలిచి కరీబియన్లకు బ్యాటింగ్ అప్పగించినందుకు జింబాబ్వే తీవ్రంగా చింతించే ఉంటుంది. ఓపెనర్ బ్రెండన్ కింగ్ (9)ను త్వరగానే వెనక్కి నెట్టినప్పటికీ.. హెట్‌మయర్ రాక జింబాబ్వే బౌలర్లను కష్టాల్లోకి నెట్టింది. హెట్‌మయర్ వస్తూనే బాదుడు మొదలెట్టాడు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీ దాటించిన అతడు.. ఆ తర్వాత ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగిపోయాడు. ఎంగరవ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు, క్రెమర్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు, సికందర్ రజా ఓవర్లో మూడు సిక్స్‌లు దంచేసిన అతడు.. 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు హోప్ (14) కూడా ఔట్ కావడంతో క్రీజులోకి వచ్చిన పావెల్ కూడా బ్యాట్ ఝళిపించాడు. హెట్‌మయర్ కాస్త తగ్గిన దశలో పావెల్ విరుచుకుపడ్డాడు. 29 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. అయితే 15వ ఓవర్లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో హెట్‌మయర్ ఔట్ కావడంతో 122 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. నిజానికి అతడు 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్దే ఔట్ కావాల్సింది. కానీ అతడిచ్చిన తేలికైన క్యాచ్‌ను ముజరబాని వదిలేయడంతో జింబాబ్వే భారీ మూల్యమే చెల్లించుకుంది. జింబాబ్వే ఫీల్డర్ క్యాచ్ వదిలేయడంతో ఆ తర్వాత అతడు మరోసారి హెట్‌మయర్ బతికిపోయాడు. ఎట్టకేలకు అతణ్ని ఔట్ చేసినా, పావెల్ కూడా నిష్క్రమించినా.. జింబాబ్వేకు ఉపశమనమేమీ దక్కలేదు. రూథర్‌ఫర్డ్ (31 నాటౌట్; 13 బంతుల్లో 3ఐ4, 2ఐ6), షెపర్డ్ (21; 10 బంతుల్లో 3ఐ6) దంచేయడంతో విండీస్ స్కోరు 250 దాటింది. విండీస్ ఆఖరి మూడు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 46 పరుగులు రాబట్టింది.

## అహాన్ని పక్కన పెట్టండి



టీమ్‌ఇండియా అహాన్ని పక్కనపెట్టి, పరిస్థితులకు తగినట్లు బ్యాటింగ్ చేయాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల తేడాతో ఘోరపరాజయం పాలైన నేపథ్యంలో ఆయన స్పందించాడు. "బ్రెవిస్, మిల్లర్ ఎంత బాగా భాగస్వామ్యాన్ని నిర్మించారో. భారత బ్యాటర్లు కూడా వాళ్ల లాగే ఆడాల్సింది. కానీ అలా చేయలేదు. అతి విశ్వాసంతో క్రీజులోకి వచ్చి, ఇష్టం వచ్చినట్లు బ్యాట్ ఊపారు. వికెట్లు కోల్పోయారు. దక్షిణాఫ్రికా చాలా తెలివిగా భారత్‌పై పైచేయి సాధించింది. విజయానికి వాళ్లు సంపూర్ణ అర్హులు" అని గావస్కర్ అన్నాడు. "దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ నుంచి భారత్ ఏమీ గ్రహించలేదు. బౌండరీ వస్తుందన్న ఆశతో భారత బ్యాటర్లు ప్రతి బంతినీ బాదడానికి ప్రయత్నించారు. టీ20 క్రికెట్ ఆడాల్సిన పద్ధతి అది కాదు. ప్రత్యర్థి నుంచి నేర్చుకోవాలి. ఇలాంటి కఠినమైన పిచ్‌పై మెరుగైన స్కోరు సాధించాలంటే అహాన్ని పక్కన పెట్టాలి. పరిశీలించాలి. పరిస్థితులకు తగినట్లు సర్దుబాటు చేసుకోవాలి" అని చెప్పాడు. వచ్చే మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్ జట్టులోకి రావడం ఖాయమని గావస్కర్ అన్నాడు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com